# శ్రీ సాయిబాబా
# జాతీయ డిగ్రీ మరియు పి.జి. కళాశాల
## అనంతపురం

**స్వయం ప్రతిపత్తిని కలిగి,**
**'నాక్' ద్వారా 'ఎ' స్థాయి గుర్తింపును పొంది,**
**యు.జి.సి. వారిచే ఉత్తమ సామర్థ్యముగల కళాశాలగా**
**ధృవీకరింపబడినది.**



## కళాశాల వార్షిక సంచిక

2009 - 2010

# SRI SAI BABA NATIONAL DEGREE & P.G. COLLEGE

**(AUTONOMOUS)**

**Accredited at the 'A' level by NAAC**

**College with Potential for Excellence Status by U.G.C.**

(Under the Management of Anantapur District National Education Trust, Anantapur)

**ANANTAPUR – 515 001**

## GOVERNING COUNCIL


**Sri T. RAMALINGA REDDY,** B.Sc., B.L.
PRESIDENT

**Sri G.N. PANDU RANGAIAH**
VICE-PRESIDENT

**Sri P.L.N. REDDY,** B.A. B.L.
CORRESPONDENT

**Sri MEDA SUBRAMANYAM,** M.Com., LL.B.
SECRETARY

**Sri S.S. RANGAIAH,** D.Pharm.
TREASURER

**Sri P. RAMESH BABU,** B.Com.
MEMBER

**Sri G.P. RAMAIAH**
MEMBER

**Sri G.K. SUBRAMANYAM,** B.Tech.
MEMBER

**Sri P.V. RAMANA REDDY,** M.Tech.
MEMBER

**Sri K.M. SAFIULLAH,** M.B.A.
MEMBER

**Sri V. JAYACHANDRA CHOWDARY,** B.A.Litt.
MEMBER

# SRI SAI BABA NATIONAL DEGREE & P.G. COLLEGE

**(AUTONOMOUS)**

**Accredited at the 'A' level by NAAC**

**College with Potential for Excellence Status by U.G.C.**

(Under the Management of Anantapur District National Education Trust, Anantapur)

**ANANTAPUR – 515 001**

## MAGAZINE COMMITTEE

**CHAIRMAN**

**Dr. K. NIRMALAMMA,** M.Com., M.Phil., Ph.D.
Principal

**CONVENER**

**Dr. P.P.V.D. NAGA TRISULA PANI,**
M.A. (Skt), M.A. (Tel), Ph.D., R.B. Praveena (Hindi)
Reader in Sanskrit

**MEMBERS**

**Dr. K. SREERAMI REDDY,** M.A., M.Phil., Ph.D.
Reader in Telugu

**Dr. A.C. RANGAPPA,** M.A., M.Phil., Ph.D.
Reader in Economics

**Dr. A. RAMAKRISHNA,** M.Sc., M.Phil., Ph.D.
Reader in Zoology

**Dr. K. GOPAL REDDY,** M.A., M.Phil., Ph.D.
Reader in English

**Dr. Y. MUNIKRISHNA REDDY,** M.Sc., M.Phil., Ph.D.
Reader in Physics

**Dr. U. VENKATA RAMANA,** M.A., M.Phil., Ph.D., B.Ed.
S.G. Lecturer in English

# SRI SAI BABA NATIONAL DEGREE & P.G. COLLEGE

**(AUTONOMOUS)**

**Accredited at the 'A' level by NAAC**

**College with Potential for Excellence Status by U.G.C.**

(Under the Management of Anantapur District National Education Trust, Anantapur)

**ANANTAPUR – 515 001**

## THE COLLEGE EMBLEM

The Emblem of the College symbolizes the aspirations of the Institution. *Thamasoma Jyothirgamaya* is a line from **Brihadaranyakopanishad.** It means 'lead us from darkness to light'. It is not physical darkness but the darkness of ignorance, and light stands for knowledge. This premier Institution has been named after the great saint and savant, **Sri Shiridi Sai Baba**, the presiding deity and guiding spirit of the Institution. While the book in the emblem symbolizes knowledge, the lotus suggests the flowering and awakening of intelligence. *Vidyaya Amruthamasnute* is taken from the **Isavasyopanishad**. It means, by acquiring *Vidya* (Ultimate Knowledge), one can attain immortality.

# సంపాదకీయం

స్వయం ప్రతిపత్తిని పొంది, ఈ జిల్లాలోనే విశిష్టమైన కళాశాలగా పేరు తెచ్చుకొన్న మా శ్రీ సాయిబాబా జాతీయ డిగ్రీ మరియు పి.జి. కళాశాల యొక్క వార్షిక సంచికను ప్రచురించి, వెలుగులోకి తీసుకురావడంపట్ల నాకు, మా సంపాదక సభ్యులకు ఎంతో ఆనందంగా ఉంది. వాస్తవానికి ఈ వార్షిక సంచిక విద్యార్థులకొక తీపి జ్ఞాపకం. అపురూపంగా భద్రపరచుకొనే ఒక అమూల్య నిధి. అప్పుడప్పుడే బాధ్యతగల పౌరులుగా రూపుదిద్దుకొంటున్న విద్యార్థులు లేఖనారూపంగా తమ ప్రతిభను వ్యక్తం చేసుకోవడానికి ఈ సంచిక ఒక వేదిక. తాము కూడా ప్రచురణ స్థాయికి చెందే రచనలు చేయగలమనే ఆత్మవిశ్వాసానికి ఇది ఒక పునాది. ఇక అధ్యాపకులుగా విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు మాకు ఇది ఒక సదవకాశం. ఇతర విద్యార్థులకు కూడా స్ఫూర్తిని కలిగించడానికి ఇది నాంది. అందుకే ఈ వార్షిక సంచికను ప్రచురిస్తున్నాము. ఈ సంచికలోని రచనలు విజ్ఞానాన్ని, వినోదాన్ని అందజేస్తాయి. కళాశాల కీర్తిని ఇనుమడింపజేస్తాయి.

ఈ సంచికను ప్రచురింప చేయడానికి నాకు, మా సంపాదక సభ్యులకు, అవకాశమిచ్చిన ప్రిన్సిపాల్‌గారికి మా ధన్యవాదములు. మేము కోరిన విధంగా సంచిక ప్రచురణకు అన్ని విధాల సహకరించిన మా కరస్పాండెంట్ శ్రీ పి.ఎల్.ఎన్.రెడ్డిగారికి, సెక్రటరీ శ్రీ మేడా సుబ్రమణ్యం గారికి, ఇతర పాలక మండలి సభ్యులకు మా కృతజ్ఞతలు. మాకు కావలసిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందజేసిన మా సహాధ్యాపకులకు, బోధనేతర సిబ్బందికి, మా అభినందనలు. ఇందులో రచనలు చేసిన విద్యార్థులకు మా ఆశీస్సులు. సకాలంలో అందంగా ముద్రించి ఇచ్చిన శ్రీ గణేష్ ప్రింటింగ్ ప్రెస్‌వారికి మా అభినందనలు. ఇక ఈ సంచికను మీరు చదివి ఆనందించండి...

ఇట్లు

**పి.పి.వి.డి. నాగత్రిశూలపాణి**

కన్వీనర్

# సుభాషితము

*శ్లో॥ విద్యా నామ నరస్య రూపమధికం ప్రచ్ఛన్నగుప్తం ధనం*
*విద్యా భోగకరీ యశస్సుఖకరీ విద్యా గురూణాం గురుః ।*
*విద్యా బంధుజనో విదేశగమనే విద్యా పరా దేవతా*
*విద్యా రాజసు పూజ్యతే నహి ధనం విద్యావిహీనః పశుః ॥*

**భావము :** మానవుడికి విద్యయే రూపము. విద్యగలవాడు బాహ్యంగా అంత రూపవంతుడు కాకున్నా తనకున్న విద్యచే సుందరుడుగా ప్రకాశిస్తాడు. విద్యయే రహస్యముగా దాచిపెట్టబడిన ధనము వంటిది. విద్యయే సకల భోగభాగ్యములను, కీర్తిని, సుఖమును కలుగజేయును. ఎన్నో సందర్భాలలో విద్య గురువులకు కూడా గురువై సమస్తమును బోధించును. విదేశాలకు వెళ్ళినపుడు విద్య ఒక బంధువులా సహాయపడుతుంది. మానవులపాలిట విద్యయే పరదేవత. విద్య ఒక్కటే రాజుల చేత కూడ పూజింపబడునట్లు చేయగలదు. ధనమిట్టిది కాదు. ఇంతటి మహత్తరమైన విద్యను సాధించనివాడు పశువుతో సమానమే.

**(భర్తృహరి కవి రచించిన 'నీతిశతకము' నుండి)**

# CONTENTS


| Sl.No.<br>క్ర.సం. | Topic<br>విషయము | Author<br>రచయిత | Page No.<br>పుట సంఖ్య |
|---|---|---|---|
| 1. | Retrospect and Prospect - A Memoir | Sri P.L.N. Reddy, Correspondent | i |
| 2. | Message | Sri Meda Subramanyam, Secretary | iv |
| 3. | A Brief History of the College | Dr. K. Nirmalamma, Principal | v |
| 4. | సృష్టికి మూలం అమ్మ | వి. రాఘవేంద్ర | 1 |
| 5. | అమ్మంటే | జి. విఘ్నేశ్వరి | 1 |
| 6. | నా కవితలు | ఐ.శృతి | 1 |
| 7. | ఇది వినండి | సి. తేజోవతి | 2 |
| 8. | ఓ పువ్వా | బి. సంధ్యారాణి | 2 |
| 9. | కావాల్సిందేనా | యల్. నీలకంఠ | 3 |
| 10. | నిరుద్యోగి | యస్. రాఘవేంద్ర | 3 |
| 11. | ప్రియతమా | యస్. హరిప్రసాద్ | 4 |
| 12. | అభిలాష | పి. నాగవర్ధన్ రెడ్డి | 4 |
| 13. | మా ఊరి పొలిమేర | యం. రవితేజ | 5 |
| 14. | కొత్తబంగారులోకం | టి.సుధీర్‌కుమార్ | 5 |
| 15. | మహిళ | ఎ. కీర్తన | 6 |
| 16. | ఎందుకో ఆరాటం | డా॥ ఏర్పేడు మునికృష్ణారెడ్డి | 7 |
| 17. | నా ఆశ | యస్. హరిప్రసాద్ | 7 |
| 18. | భలే వ్యాధి | జి. విఘ్నేశ్వరి | 7 |
| 19. | ఫ్యాక్షన్ | డా॥ కె. శ్రీరామిరెడ్డి | 8 |
| 20. | శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మంగారు | ఎ. వెంకటేష్ | 9 |
| 21. | మాతృప్రేమ | జి. విఘ్నేశ్వరి | 11 |
| 22. | మారిపోయిన సమాజం, మరిరాదా మనకు ఆదర్శ సమాజం ? | వి. సునీల్‌కుమార్ | 12 |
| 23. | సమాజంలో యువత పాత్ర | కె. రమేష్ | 14 |

# CONTENTS


| Sl.No.<br>క్ర.సం. | Topic<br>విషయం | Author<br>రచయిత | Page No.<br>పుట సంఖ్య |
|---|---|---|---|
| 24. | విజయం | యన్. శివజ్యోతి | 15 |
| 25. | అధికార ప్రధానమే మహిళలకు బలం | బి. దీప్తి | 18 |
| 26. | హరితాంధ్రప్రదేశ్ సృష్టికర్త | బి. శ్రీనివాసరెడ్డి | 19 |
| 27. | సంస్కృతాధ్యయనం కిమర్థమ్ | డా॥ పి.పి.వి.డి. నాగత్రిశూలపాణి | 20 |
| 28. | గురజాడ గేయాలు – కథన కౌశల్యం | డా॥ కె. శ్రీరామిరెడ్డి | 23 |
| 29. | నా రైతు ఏమయ్యాడు | యస్. హరిప్రసాద్ | 25 |
| 30. | శశికరం | కె. సౌమ్య | 28 |
| 31. | వాఙ్మాలం | చిలుకూరి దీవెన | 30 |
| 32. | My Friend | G. Vigneswari | 35 |
| 33. | A Woman | D. Ramya Sudha | 35 |
| 34. | School Days | B. Sandhya Rani | 35 |
| 35. | The Sunflower | K. Abhishek | 36 |
| 36. | An Ideal Student | N. Sai Karuna | 37 |
| 37. | The Qualities of a True Indian | K. Abhishek | 38 |
| 38. | Brain Drain | Shaik Abdul Jaffar | 39 |
| 39. | Causes & Prevention of a Heart Attack | Y. Shalina | 41 |
| 40. | Ancient Vaimanika Shastra | K.M. Manju Bharadwaj | 43 |
| 41. | Global Warming | Shaik Abdul Jabbar | 45 |
| 42. | Higher Education in India | T. Chakradhar Rao | 47 |
| 43. | Advantages of the Semester System | Dr. K. Gopal Reddy | 48 |
| 44. | Autonomy, An Instrument of Quality Education. | Dr. U. Venkata Ramana | 51 |
| 45. | Secularism in India | Dr. C. Ramanjaneyulu | 53 |
| 46. | Noble Indians | Dr. D. Sailaja | 55 |
| 47. | Career in Entrepreneurship | D. Dadapeer & R.R.D. Sirisha | 57 |
| 48. | Accounting : Facts and Trends | B. Areef Basha | 59 |
| 49. | The Wise Sayings | Dr. P.P.V.D. Naga Trisula Pani | 60 |



# Retrospect and Prospect - A Memoir

**P.L.N. REDDY**
**Correspondent**

Let me at this stage go down the memory lane and recapture some precious moments in my life giving me the splendid opportunity of serving the cause of education. It was on a sunny morning in June 1945, my father the late Sri P. Kesava Reddy took me to a small school situated in a private building called Peravali Building for admitting me to VI class. My father was a staunch disciple of the late **Sri Sirivaram Adinarayana Rao** garu who had just then started the school and named it Sri Sai Baba National High School. This school was then situated in just 4 thatched sheds. My father paid a donation of Rs.5.00 while admitting me because he believed that every paisa donated was sure to be utilized for a noble cause.

Though I was very young, I was inspired by Sri Sirivaram Adinarayana Rao garu who visited the school regularly twice a day in the morning and in the evening. He had a great knack of selecting very eminent teachers. One of them was Sri Gunti Subramanya Sarma, the first Headmaster of the School. Later the school was shifted to the present premises in June 1948 where there were about half a dozen thatched sheds to accommodate 12 classes. Thereafter, Sri Peddapalli Raghavendra Char was appointed Headmaster. He was a retired Headmaster from the District Board. Some of the notable teachers appointed in 1948 were the late Sri Lakshmana Char, Sri. R. Vitala Char, Sri J.S. Bheemasena Rao, Sri K.Gundachar, Sri P. Narayana Rao, Sri K. Narayana Rao, Sri Bhima Rao, and Sri Rama Rao. Soon the school shot into fame and people began to seek admission to this school in spite of the lack of facilities like classrooms and furniture. All the teachers worked hard day in and day out for the welfare of the students. It was an honour to be a student of S.S.B.N. High School. The result of the S.S.L.C. examinations usually was 98%. This was all because of the hard work of the committed teachers and the unstinted support of the Management.

An area of 7.5 acres of land was purchased in 1944 for the school and till 1970 Sri S. Adinarayana Rao toiled day in and day out to create facilities for the school. In 1969, the Government wanted Intermediate Education as a separate unit bifurcating it from University Education. Sri Rao, without a penny in his pocket, requested the Government to permit him to start a Junior College under the Management of S.S.B.N. Educational Trust. Though the Government wanted a deposit of Rs.50,000/- for starting the college, he managed to get a full wavier of the deposit.

In May 1970, Sri S. Adinarayana Rao was in search of a pair of young men mostly from the Alumni of the school to take over the management from him. On 2nd May, he called for a meeting which was attended by Sri Meda Ramaiah, Sri M. Subbaiah, Sri P. Radhakrishnaiah, some elite of the town and some old students. After a prolonged discussion, Sri Rao finally summed up the proceedings by announcing the new Management with **Sri K.S. Jayaram**, Advocate, as President, **Sri P.L.N. Reddy**, Advocate, as Correspondent, **Sri Meda Subramanyam**, Tax Consultant, as Secretary, and **Sri P. Pandu Rangaiah** as Treasurer.

On May 7th, I met Sri Adinarayana Rao in his house in Court Road for taking his blessings before accepting an onerous responsibility of becoming the Correspondent of a premier educational institution in Rayalaseema in particular and A.P. in general. And on the same day, I took charge as the Correspondent of the School and met Sri Lakshmana Char, the Head Master of the School. During my discussion with him about the intricacies of the Management of the school, Sri Lakshmana Char told me that he was to retire within a fortnight. I was unnerved at this and spoke to the then Director of Public Instruction, Sri T. Ramachandran, who was my teacher in the local Government Arts College. I told him that I had taken over the Management and I needed the services of Sri Lakshmana Char, the most experienced Head Master. He congratulated me and promised to extend his services for five years. That was my first achievement as the Correspondent. Since then I managed to get an extension of five years for every teacher who retired.

I had in the beginning felt a sort of embarrassment to speak to my teachers on things such as discipline, curriculum, etc. It was my greatest good fortune that all the teachers who taught me were always supporting me in all my efforts. In March 1970, I was elected as a Member of the Syndicate of S.V. University and sought the nomination of Sri M. Lakshamana Char as a Member of the Senate of the University, which was a prestigious position for a Headmaster. In 1979 after three terms as Correspondent, I handed over charge to Sri. P. Konappa Sastry, Advocate, who was good and hard working. We could all manage to have a Degree College in 1981. It was Sri Bhavanam Venkatarami Reddy, the then Education Minister who inaugurated the Degree College at my personal request. In 1985, Sri Meda Subramanyam became the Correspondent and I took over the position of Secretary for 12 years. It was the hard work of both of us that has put the College on the path of progress. It was God's grace that an eminent professor, Dr. G. Ram Reddy became the Chairman of the UGC I knew him for quite some time and so managed to admit this young private Degree College into the fold of the UGC during the Seventh Plan.

Since then, the teaching and non-teaching community of this college tried their best not to let down the efforts of the Management. 33 teachers of this college have been honoured with Ph.D.s and 28 of them are Readers. Such a large number of Readers is unique in a college since it is almost on par with a University. Probably this is the only private college in the whole Indian sub-continent which has so many Ph.D.s. Enthused

by the performance of the teachers, I embarked upon starting self-financed courses like B.Sc Computers, Micro Biology, Electronics, etc., in the year 1993. This was the first college in the whole of Rayalaseema to start self-funding courses which was emulated by other colleges in the region. The teachers of this institution wanted P.G. courses to be offered and in 2002 the first P.G. course in Electronics was started. Later on Mathematics, Physics and Chemistry were added. In 2005 the Management and the teachers made a hectic effort to make this institution an Autonomous one. The UGC gladly accepted our proposal and **granted autonomy to the institution in 2005**. The Management, Teaching and Non-Teaching community didn't stop at that and they approached the National Assessment and Accreditation Council to visit the college for accreditation because this gives the college national level parity in the matter of its quality, performance, and overall development. The NAAC Peer Committee visited the college in March 2007 and **credited it with 'A' Grade.** As a consequence, there is a flow of UGC funds to the institution for its developmental activities. Yet another feather in the cap of the institution was the recognition of the college as one endowed with the Potential for Excellence which paved the way for getting financial assistance from the UGC to the tune of 1.5 crores. **This CPE status was accorded** to the institution after a careful national level open assessment by the UGC with the parameter scores placed on the UGC website for everyone to see and know what an educational institution stands for.

I will be failing in my duty if I do not give due credit to the efforts of Sri P.V. Ramana Reddy, Retired Superintending Engineer, Sri Krishnadevaraya University and presently a Member of our Governing Council for his unstinted support in creating accommodation for all our educational institutions – High School, Junior College, Degree College, B.Ed. College, and P.G. College. Another notable contribution is from Sri G.K. Subramanyam, one of our G.C. members. But for his untiring efforts, the 150 odd computers in the college would not have worked continuously for the last two decades. I express my deep sense of gratitude to them for all the services rendered to this institution. I have been with this institution since 1945 since my days as a student slowly graduating into the role of a guide leading the institution to its destiny of being a lead college worth appreciation and even approbation. I have achieved laurels for this institution by the grace of Lord Sri Shirdi Sai Baba and with the unstinted support of my good friend Sri Meda Subramanyam and other members of the Management.

On this occasion of the bringing out of the College Magazine, I express my deep sense of gratitude to all the teachers present and past for their whole-hearted support to all the programmes visualized and executed with finesse. My blessings to all of them for their dedicated service to this institution. I always cherish the ever green memory of the young boys and girls who have studied in the portals of this great institution carving out their future and identity and telling me occasionally of how they have been made full-fledged persons with zeal and a sense of mission. My blessings are with them. Bringing up an educational institution is a relentless life-time activity and I only wish that every one of us should continue to serve this great institution and take it to still greater heights.



# MESSAGE

**MEDA SUBRAMANYAM**
**Secretary**

This Institute of knowledge and Education was established in the year 1940 as an ordinary elementary school by the Founder late Sri. Sirivaram Adinarayana Rao.

It is easy to feed a hungry person, but to educate a person and pour knowledge into him is an enormous effort. The founder chose the second option and bravely established this institution. Some of us have seen the growth and development from the beginning. Presently it has grown into an edifice of knowledge. The symbol 'Thamasoma Jyothirgamaya' itself presents that the institution leads persons from darkness to light by catering sustainable knowledge. Acquiring 'Vidya' leads to immortality.

This 'Motto' is being followed tirelessly by the teaching staff. After the founder, many philanthropists and educationalists put their souls and hearts to raise this institution to its present glory. The Institution which began in huts has now got the shape of a gigantic structure. The growth of the institution owes its greatness to the dedication and hard work from the Attender to the Principal. The President, the Correspondent, the Secretary and Members of the Governing Body have raised this temple of learning to the pinnacle with their hard work, commitment and dedication.

It is not the end. The Governing Body and the entire teaching staff always think how to achieve progress and perfection as acquiring knowledge is an endless effort. The motto has been to propel the growth of the institution by the knowledge of the members of the Management and the teaching staff.

I am happy to announce that I studied in this institution in 1953 and I have been on the Management for the last 40 years in various capacities. I congratulate the Magazine Committee on their bringing out the college magazine beautifully.

❀ ❀ ❀ ❀



# A BRIEF HISTORY OF THE COLLEGE

**Dr. K. NIRMALAMMA**
**Principal**

An Institution which was started as an ordinary elementary school in the early 1940's by a Philanthropist and visionary, **Late Sri Sirivaram Adinarayana Rao,** has now extraordinarily grown into a full-fledged College imparting quality education through its Undergraduate and PG Courses. The long cherished desire of this backward region of Rayalaseema to have a premier Higher Educational Institution in the Private Sector, was fulfilled when **Sri Sai Baba National Degree College** (named after Sri Shiridi Sai Baba) was established as per the G.O.Ms. No.1016 dated 07-09-1981. This co-educational Institution was inaugurated by **Sri. Bhavanam Venkatarami Reddy**, the then honourable Minister for Education, Government of AP on 14-12-1981. Sri Venkateswara University, Tirupati, granted permanent affiliation to the college on 20-05-1987. Subsequently, it was affiliated to Sri Krishnadevaraya University, Anantapur, from the academic year 1987-1988. The Govt. of AP was pleased to admit this college to Grant-in-Aid with effect from 16-04-1990 vide G.O.Ms. No.170, Edn.dated 12-07-1990 with a view that higher education should be made available to the poor and needy in this backward region.

The **Anantapur District National Education Trust** (Regd.), Anantapur, represented by the elite of the town from all walks of life, manages this private aided Institution. With its most experienced, competent and committed faculty, and excellent infrastructure facilities, the Trust has made it possible to impart quality education at a very reasonable and affordable fee structure for two and half a decades. With a view to keep pace with knowledge explosion and to give employment orientation to education, this College started self-financing UG Courses from the academic year 1993-1994. This Institution which had a student strength of about 500 at the end of the academic year 1983-1984, is now able to maintain more than 2500 students including 1100 girl students. At present, there are as many as 83 highly qualified and richly experienced Lecturers and 10 guest faculty to take care of the educational needs of the students. This incredible growth bears testimony to the all round success that has transformed the college into an outstanding educational Institution in the region.

Sri P.L.N.Reddy as an experienced Correspondent has rendered yeoman service to the institution. He has left no stone unturned to make the institution what it is today. As a Senate and Syndicate member of both S.V. University and S.K. University he has had cordial relations with many eminent Vice-Chancellors, the people of high profile and political leaders. This has largely helped him to shape this institution as a premier and model one in the district. Sri. Meda Subramanyam, an eminent advocate and tax consultant of the town and the present Secretary of the college deems it a pleasure to associate himself with the all round development of the institution. Besides the Correspondent and the Secretary, all Members of the Governing Council evince great interest in the growth of the college.

Inspired by the academic success, the Degree College opted for Autonomy. It entered into a new phase of its educational life with the **University Grants Commission, New Delhi** granting **Autonomous Status** from the academic year 2005-2006 in accordance with the New Education Policy, 1986. Thus, the college has earned a unique distinction of being the only autonomous college in the whole district.

The **Assessment** and **Accreditation** of our College at the 'A' level by NAAC has given us a right opportunity to undertake an extensive critical analysis of our systems and practices and arrive at a realistic image of our Institution. The NAAC grading has greatly strengthened our Institution and given us the right direction for all round development for imparting quality education to the students more purposefully. The college has recently been awarded **College with Potential for Excellence** (CPE) status by the UGC.

The unique distinction of the College is that 33 Teachers are Ph.D. Degree holders, 28 of them are Readers. Besides, there are 06 Selection Grade and 13 Senior Scale Lecturers. Many of them have participated in a number of National and International Seminars in their respective fields. They have enriched their knowledge by contributing research articles to various National and International Journals. Many of the teachers of the institution are acting as research supervisors guiding M.Phil and Ph.D scholars of various universities. They have produced about 60 M.Phils and as many as 70 are pursuing research. Two Readers from the Department of Physics, Dr. Y. Narasimha Murthy and Dr. D. Sailaja have been sanctioned two major research projects by the UGC.

The all-round abilities of our Lecturers were also recognised by the A.P. State Govt. Six of our teaching staff – Dr. B. Sivarama Krishna, Reader in Zoology, Dr M. Nazeer Ahamed, Reader in History, Dr. Y. Narasimha Murthy, Reader in Physics, Dr. C. Prabhakar Raju, Reader in Botany, Dr K. Nirmalamma, Principal and Dr. P.P.V.D. Naga Trisula Pani, Reader in Sanskrit – were honoured with **Best Teacher Awards** by the Government of Andhra Pradesh in 1994, 1997, 2000, 2004, 2005 and 2006 respectively.

The Institution focuses its attention on the innovative efforts that help in its academic growth. It promotes social responsibilities and good citizenry, an ambience of creativity and innovation and adopts quality management strategies in all academic and administrative aspects. It has been known for its quality education all these 25 years. It has introduced diversified modern self-financing courses suitable to the changed circumstances. It has achieved a vertical quantum of leap with the introduction of P.G. Courses and a couple of Certificate Courses.

The Management, the Principal, the staff and the students continue to work hard to achieve greater glory and excellence in the years to come. With this glorious background, this Autonomous institution marches ahead with robust optimism, strength and vigor in tune with the growing and changing needs of the student community so that the vision of the Founder, Sri.Sirivaram Adinarayana Rao is achieved.

❃ ❃ ❃ ❃

# సృష్టికి మూలం అమ్మ

– వి. రాఘవేంద్ర

బి.జడ్.సి. (తె.మీ) ప్రథమ

అందమైన జాబిలి అమ్మ
అమృత వర్షిణి అమ్మ
అనురాగాన్ని పెంచేది అమ్మ
ఆత్మీయతకు అర్థం అమ్మ
అవసరాలు తీర్చేది అమ్మ
అక్కున చేర్చేది అమ్మ
అడుగులు సవరించేది అమ్మ
అసమానతలు చూపనిది అమ్మ
భారం మోసేది అమ్మ
సృష్టికి మూలం అమ్మ

* * * *

# అమ్మంటే...

– జి. విఘ్నేశ్వరి

బి.కామ్. (తె.మీ.) ప్రథమ

సప్త స్వరాలకన్నా...అమ్మ జోలపాటమిన్న
సప్త సముద్రాలకన్నా...అమ్మ మనసుమిన్న
స్వర్గలోకంకన్నా...అమ్మ ఒడిమిన్న
పరమేశ్వరుని పదాలకన్నా...అమ్మ పాదాలుమిన్న.

ఒడిలోన ఊపి...జోలపాట పాడి
నిదురపో అంటూ...తాను మేలుకొంటూ
కనురెప్పలా నన్ను...కాపాడుకుంటూ
నన్ను ప్రేమగా చూసుకొన్న అమ్మే...అమ్మంటే

# నా కవితలు

– ఐ.శృతి

బిటి.యమ్.సి. ప్రథమ

## అమ్మ

అమ్మ పాలు అమృతం
అమ్మ ప్రేమ శాశ్వతం
అమ్మ ఒడే ఆలయం
అమ్మ అవనికే దైవం.

## మదర్‌థెరిస్సా

అనాథలకు అమ్మ నీవు
అన్నార్తులకు అన్నం నీవు
నిరాశ్రయులకు నీడ నీవు
అభాగ్యులకు భాగ్యం నీవు
ఒడిచేర్చి ఎందరినో లాలించావు
ప్రేమకు ప్రతిరూపమై అవనిలో వెలిశావు
హీనులకు, దీనులకు అండవై నిలిచావు
అకళంకమైన నీ సేవలు
అందించాలి మాకు ఆదుకొనే తత్త్వాన్ని

## వైద్యులు

ధన్వంతరి వారసులు
ధనవంతుల బానిసలు
ధనార్జనేధ్యేయమైన
జనభక్షక జలగలు
ఒకప్పుడు వైద్యోనారాయణో హరిః
ఇప్పుడు ధనంలేకుంటే
ప్రాణం గోవిందో హరి

## నేటి చదువు

పిల్లలకు పుస్తకాల బరువు
అయ్యవార్లకు మద్దెల దరువు
నిరుపేదలకు కొనడానికి కరువు
వ్యాపారులకు కల్పతరువు
ఇదేనండి బాబూ, నేటి చదువు

## నేను ప్రపంచ మానవుణ్ణి

కులంతోనన్ను కట్టిపడేయకండి
కులం కుత్సితమైంది
మతంతోనన్ను ముడిపెట్టకండి
మతం మత్తు మందు
నా కులం సకల సద్గుణ సమ్మేళనం,
నా మతం సర్వమత సమ్మతం
నా నీతి, మానవులంతా ఒకే రీతి,
నా జాతిలోకానికివ్వాలి శాంతి విభూతి
నేను కుల మత ప్రాంతాలకు అతీతుణ్ణి,
నేను ప్రపంచ మానవుణ్ణి.

❋ ❋ ❋ ❋

# ఇది వినండి

**– సి. తేజోవతి**
యమ్.పి.సి. (తె.మీ) తృతీయ

## రిక్వెస్ట్

సృష్టిలో స్నేహం ఎంతో బెస్ట్
అది అన్నింటికన్నా స్వీటెస్ట్
దాన్ని మరువనివాడు గ్రేటెస్ట్
అందుకే మరువద్దని నా రిక్వెస్ట్

## జన్మ ధన్యం చేసుకో

తల్లి జన్మనిస్తుంది
గురువు జీవిత రహస్యాన్ని తెలుపుతాడు
వయసు కర్తవ్యాన్ని తెలుపుతుంది
మంచి పనులు చేస్తే
మార్గం స్వర్గానికి సుగమం
చెడు పనులకు ఫలితంగా
చేరేదిక నరకమే
అందుకే...మంచి మార్గం ఎంచుకో
జన్మ ధన్యం చేసుకో...

❋ ❋ ❋ ❋

# ఓ పువ్వా...

**– బి. సంధ్యారాణి**
బి.యమ్.సి. ప్రథమ

అందమైన ఓ పువ్వా...
అందరుమెచ్చిన ఓ పువ్వా !
సృష్టి ఇచ్చింది నీకో జన్మ
భూమిలో పుట్టేవు నీవు పువ్వుగా
గాలిలో ఎగిరే తుమ్మెద
నీపై వాలి ఆకలి తీర్చుకుపోతుంది
అందరిలో అందంగా
పూజల్లో ప్రముఖంగా
అన్నింటిలో ముందుంటావు
అందరూ నీ వారేనంటావు.
ఉదయ సాయంకాలాల్లో
నీ సుందర రూపం చూపిస్తావు
వెన్నుకద్దంగా గుచ్చినా
వేదన భరిస్తావు

అల్లుకుపోయిన కురుల్లో
అందాల రాణిగా కూర్చుంటావు
కానీ...వన్నె తరిగితే చాలు
నిన్నో మూలకు పారేస్తారు
నీ జీవితం...మాకు చెబుతోంది పాఠం
ప్రాణం పణంగానైనా...పరార్థం సాధించాలని.

* * * *

## కావాల్సిందేనా...

**– యల్. నీలకంఠ**

బి.కామ్. కంప్యూటర్స్ ప్రథమ

కావాల్సిందేనా
తెలంగాణా కావాల్సిందేనా !
కావాల్సిందేనా సమైక్యాంధ్ర వాదుల
గుండెలు బ్రద్దలు కావాల్సిందేనా !
కావాల్సిందేనా శ్రీరాముల ఆశయాలు అడియాశలు !
ఫలించాల్సిందేనా ప్రాంతీయవాదుల పదవీకాంక్ష !
ఒకే భాష – ఒకే రాష్ట్రం
జై సమైక్యాంధ్ర నై తెలంగాణా నా నినాదం !
సమైక్యంగా ఉన్న అమెరికా సంతోషంగా వుంది
విడిపోయిన రష్యా...విలవిల్లాడింది
విడిపోయిన పాకిస్థాన్...ప్రపంచానికి తలపోటయ్యింది
విడిపోవుట చెడి పోవుటకే !
కలసి మెలసి ఉందాం. కలిమి, బలిమి సాధిద్దాం.

* * * *

## నిరుద్యోగి

**– యస్. రాఘవేంద్ర**

బి.జడ్.సి.(తె.మీ.) ప్రథమ

దుఃఖంతో పెరిగి బ్రతికాను
ఆకలితో ఆవాసం చేశాను
నన్ను నిర్వీర్యుణ్ణి చేసి
నా ఆకలి ఆడుకుంటోంది.
మంచి నీళ్ళతో కడుపు నింపాలనుకున్నా,
"ఆకలికి" తెలిసిపోయింది, ఆ నీళ్ళు చాలవని
దారి కానరాక, కళ్ళు తెరువలేక
చిమ్మ చీకటిలో,
అడుగులో అడుగు తడబడుతుంటే...
గమ్యం చేరువలో నా రక్తం ఇంకిపోయింది
చావు వస్తుంది, అనుకొంటే
అదినాతో దాగుడు మూతలు ఆడుతోంది.
ఈ పేద నిరుద్యోగి బ్రతుకింతేనా..
అయినా సిద్ధంగా నేనున్నా
ఈ ఆకలి రాజ్యపు గోడల్ని
గాలి మేడల్లా కూల్చటానికి
నిండు జీవితపు
పునాదులు నిర్మించుకోవడానికి.

* * * *

# ప్రియతమా !

– యస్. హరిప్రసాద్
బి.కామ్. (తె.మీ.) ప్రథమ

*ప్రియతమా !*
*మంచు కురిసే వేళలో*
*నీ కోసం వేచి ఉన్న నా కన్నులను అడుగు*
*వేచి ఉండటం అంటే ఏమిటో ?*
*నీతో తొలిసారి మాట్లాడిన సమయంలో*
*అదిరిన నా గుండె చప్పుడును అడుగు*
*భయం అంటే ఏమిటో ?*
*నీతో మాట్లాడిన తరువాత*
*కలిగిన అనుభూతిని అడుగు*
*సంతోషం అంటే ఏమిటో ?*
*నువ్వు దూరమైన క్షణంలో*
*వచ్చిన కన్నీటి బిందువులను అడుగు*
*దుఃఖం అంటే ఏమిటో*
*నీ అడుగులనే అనుసరించిన*
*నా అడుగులను అడుగు*
*పయనం అంటే ఏమిటో ?*
*నీ కోసం, నీ ప్రేమ కోసం,*
*ప్రతి నిమిషం నిరీక్షించే నా మనసును,*
*నీ చలించని మనసుతో అడుగు,*
*ప్రియతమా ! ప్రేమ అంటే ఏమిటో ?*
*నా హృదయంలో నీ స్థానం ఏమిటో ?*

# అభిలాష

– పి. నాగవర్ధనరెడ్డి
బి.కామ్. కంప్యూటర్స్ ద్వితీయ

*రక్తం పారించిన నేలమీద*
*ఏం పంటలు పండిస్తావు ?*
*ఖండిత దేహపు మాంసపు ముద్దలతో*
*ఏం విందారగిస్తావు ?*
*మనిషి సందడి లేని చోట*
*ఏం పండుగలు చేసుకొంటావు ?*
*అప్రియమైన ఓ టెర్రరిస్టు మిత్రుడా !*
*ప్రియమైన ఉగ్రవాది శత్రువా !*
*చంపు, చావు కన్నా*
*'బతుకు బతికించు' అన్న*
*నినాదం వెనకున్న మహానందాన్ని,*
*గాయపడిన హంసని*
*చేతుల్లోకి తీసుకున్న సిద్ధార్థుని ముఖంలో*
*ఇప్పటికైనా చూడలేవా ?*
*రక్తానికి, కన్నీళ్లకి*
*నిర్వచనాలు, విలువలను*
*మతగ్రంథాల్లో చదవకపోయినా*
*భయంతో వణికిపోతున్న*
*సామాన్య జన హృదయాలలోనైనా చదవలేవా ?*
*వదిలిపెట్టు ఉగ్రవాదం*
*తరిమిగొట్టు హింసోన్మాదం*
*ప్రయాణం చేసిన శాంతి బాటలో*
*నలుగురినీ నడిపించు*
*ఇదేనా ఆకాంక్ష ! నా అభిలాష.*

# మా ఊరి పొలిమేర

**– యం. రవితేజ**

బి.ఏ.(తె.మీ) ద్వితీయ

ఒకప్పుడు...
మా ఊరి పొలిమేరలో అడుగుపెట్టగానే
పచ్చని పంటపొలాలు పలకరించేవి
మా ఊరి పొలిమేరలో అడుగు పెట్టగానే
మట్టి వాసన గుప్పుమనేది.
పొలిమేర 'పల్లె అనే స్వర్గానికి' ద్వారం వంటిది
మా ఊరి లోపల అడుగేయగానే
ఆత్మీయానుబంధాలు పలకరించేవి.

ఇప్పుడు...
మా ఊరి పొలిమేర కబ్జాదారుల గుప్పిట్లో ఉంది
బీడు భూములు తప్ప కనుచూపు మేరలో
కూడా పచ్చదనం కనిపించదు
మా ఊరి లోపల అడుగు పెట్టగానే
తాళం వేసి ఉన్న లోగిళ్ళు వెక్కిరిస్తూ కనిపిస్తాయి
మా ఊరి పొలిమేరలో అడుగు పెట్టగానే
చావు వాసన పలుకరిస్తోంది
ఇప్పుడు పొలిమేర 'ఎడారి నరకానికి'
స్వాగతం పలుకుతోంది.

**(గ్రామీణ వలసల నేపథ్యంలో)**

# కొత్త బంగారు లోకం

**– టి. సుధీర్ కుమార్**

బి.యస్‌సి.(తె.మీ.) ద్వితీయ

ఎండిన బీడుకై వానలా
ఆవిరి అయ్యే జీవితాల చినుకులు మావి
చెత్తకుండి సహవాసం
చేయమన్నది ఆకలి పోరాటం
ఆశల నిచ్చెనలు ఎక్కడం కోసం
కోరికల పాములతో కరిపించుకుంటూ
విధి ఆడే వేట లాంటి ఆటలో
బిక్కు బిక్కు మనే ఒంటరి పావులం
అమ్మ ప్రేమ
మాకెప్పుడూ ఎడారి వానే !
క్షణం నిశ్చలత లేని
నీటి రాతల్లాంటివి మా నుదిటి రాతలు
వీధి నిశీధిలో వీడని దీపమై
విద్య అనే అమృతాన్ని పంచే
విజయానికి దారులు తెరిచే
క్రాంతి రథంలా రావాలి
మాకో కొత్త బంగారు లోకం.

* * * *

# మహిళ

– ఎ. కీర్తన
బి.ఎ. (తె.మీ) ద్వితీయ

*గుండె బరువుతో... మనసు దిగులుతో*
*మాటలే రాక... అడుగులే సాగక*
*కన్నీటి ఆవేదనతో... అర్థరాత్రిలో*
*ఒంటరిగా ఎడారిలో ప్రయాణం.*
*గమ్యం ఏదో తెలియదు*
*ధ్యేయం ఏదో ఎరుగదు*
*గగనానికి ఎగిరే పక్షిలాగ*
*గమనం తెలియని నావలాగ*
*సాగుతున్న నా నడకకు*
*ఎదురయ్యింది ఓ ప్రాణి*
*కన్నీటిని తుడుస్తూ...కారణం అడిగింది*
*అప్పుడు నేను వివరించాను*
*ఓ విషాద గాథ...*
*జీవితంలో నేను ఎన్నో పాత్రలు పోషించాను*
*కూతురుగా పుట్టాను*
*కుందనపు బొమ్మగా పెరగలేదు !*
*అన్నకు చెల్లినయ్యాను*
*ఆవేదనతోనే ఎదిగాను !*
*మంచి భార్యను అయ్యాను*
*మధనపడుతూనే వచ్చాను !*
*తల్లిపాత్ర పోషించాను*
*తపన చెందుతూనే వున్నాను !*
*ఇక పండు ముసలినైనాను*
*కష్టాలు వుండవని గాఢంగా నమ్మాను*
*కాని, నా ఆశలన్నీ అడియాసలేకాగా*
*ఇక బ్రతుకు చాలిద్దామనుకొన్నా...అప్పుడు,*
*నా ప్రాణ మిత్రురాలు ఇచ్చిందో సలహా,*
*"సమాజానికి ఏమి తెలుసు స్త్రీ విలువ ?*
*నీ అంతులేని గాథ*
*అనంత విశ్వానికే ప్రతీక*
*అనంత గగనంలో తారలకు గమ్యం వున్నట్లే*
*నీకంటూ గమ్యం వుంటుంది*
*ఆవేదనతో అలసిపోకు*
*అలజడితో కృంగిపోకు*
*నీ యదార్థగాథే అందరికీ*
*ఆదర్శబాట కావాలి*
*నీ జీవితానికంటూ ఒక అర్థం,*
*పరమార్థం వుండాలి*
*అంతవరకైనా నీవు బ్రతికుండాలి" అని*
*అప్పుడే నాకు అనిపించింది*
*నేను బతకాలని*
*బతికి సాధించాలని*
*నిదురోతున్న అన్యాయంలో*
*నిర్లిప్తమైన నరజాతి నైజాన్ని మేల్కొలపాలని,*
*మబ్బులు కమ్ముతున్న సమయంలో*
*మానవత్వానికి జీవం పోయాలని.*
*మువ్వల చాటున మోగే సవ్వడి*
*నాదే కావాలని !*
*మెరుపుల చాటున కురిసే వర్షం*
*నేనై రావాలని !*
*పువ్వుల్లోన వెల్లివిరిసే పరిమళం*
*నేనై వ్యాపించాలని !*
*కోకిలలో వెలువడే గానం*
*నాదే కావాలని !*
*అందుకు ముందుకు సాగాలని !!*
*మహిళ అంటే ఏమిటో లోకానికి చాటాలని !!*

❋ ❋ ❋ ❋

# ఎందుకో ఆరాటం...

– డా॥ ఏర్పేడు మునికృష్ణారెడ్డి

రీడర్, భౌతిక శాస్త్ర విభాగము

ఉదయానికి తపించే సూర్యుడా !
తప్పదు నీకు అస్తమయం.
తూరుపు కొండపై వెలిగే నువ్వు
జ్యోతి స్వరూపుడవని పూజింపబడతావ్ !
పడమటి దిక్కున పాలిపోతావ్.
అన్యాయం అధర్మాలని చూస్తూ
ఏమి చేయలేక మూసుకుపోతావ్.
అక్రమాలను కని కృంగిపోతావ్
ఇదేగా మానవ జీవితం
ఐనా ఎందుకో ఆరాటం.

* * * *

# నా ఆశ

– యస్. హరిప్రసాద్

బి.కామ్.(తె.మీ.) ప్రథమ

నా కళ్లకు ఎంత ఆశో !
నువ్వు కనపడవని తెలిసినా
నీ కోసం అన్వేషిస్తున్నాయి
నా కాళ్లకు ఎంత ఆశో !
నువ్వు దొరకవని తెలిసినా
నీ కోసమే అడుగులు వేస్తాయి
నా మనసుకు ఎంత ఆశో
నువ్వు దక్కవని తెలిసినా
నీ గురించే ఆరాటపడుతోంది
ఏమి చెయ్యను ప్రియతమా !
నేను ఇంకా వేచి ఉన్నది
ఎప్పటికయినా నీ మనసు మారుతుందన్న ఆశతోనే
నువ్వు నా చెంత చేరుతావన్న ఆశతోనే
నువ్వు నన్ను ప్రేమిస్తావనే ఆశతోనే.

# భలే వ్యాధి...

– జి.వి. విజ్ఞేశ్వరి

బి.కామ్.(తె.మీ.) ప్రథమ

**పేరు :** ప్రేమ

**సంక్రమించే వయస్సు :** 13 సం॥ నుండి మరణించే వరకు

**సంక్రమించే ప్రదేశాలు :** స్కూళ్లు, కాలేజీలు, పార్కులు, రెస్టారెంట్లు, రైల్వేస్టేషన్లు, గుళ్లు, సినిమాహాళ్లు మొదలైనవి.

**వ్యాపించేవిధానం :** చూపులు, లేఖలు, గ్రీటింగులు, ఫోన్లు, ఈమెయిల్లు, ఇంటర్నెట్లు.

**వ్యాధి సోకిన వారికి నచ్చే రోజు :** ప్రేమికుల రోజు

**నచ్చని రోజు :** రాఖీ పండుగ రోజు

**ముఖ్య లక్షణాలు :** ఏ పని మీద మనస్సు లగ్నం చేయలేకపోవడం, అన్నం సహించకపోవడం, ప్రేమించిన వ్యక్తి ఎదురుపడితే మాటలు తడబడటం మొ॥వి.

**వ్యాధి ముదిరే కొద్దీ బయట పడే లక్షణాలు :** మందు కొట్టడం, గడ్డం పెంచుకోవడం, ఆకాశం వైపు చూస్తూ పిచ్చి పిచ్చిగా మాట్లాడటం, నవ్వడం మొ॥వి.

**రోగం తగ్గక పోవడానికి కారణం :** కులం, మతం, పెద్దలు, ఆర్థిక పరిస్థితులు, డబ్బు మొ॥వి.

**చికిత్స :** కలసి బ్రతకడమే...లేదా చావడం. నివారణ లేదు...చికిత్స ఒక్కటే మార్గం.

స్త్రీ అనే 1 అక్షరం కోసం
ప్రేమ అనే 2 అక్షరాలను నమ్ముకొని
జీవితం అనే 3 అక్షరాలను వదులుకొని
చదువులు అనే 4 అక్షరాలను నాశనం చేసుకొని
తల్లిదండ్రులు అనే 5 అక్షరాలను విస్మరించకు !

# ఫ్యాక్షన్

– డా॥ కె. శ్రీరామిరెడ్డి
రీడర్, తెలుగు విభాగము

'నేను' తనములోని గొప్పతనముజూప
పంతమెక్కుడవ్వ పగలు పెరుగ
కూళ్ళుబుద్ధి పెరిగె, క్రుళ్ళు తనము హెచ్చె
అహము పెరుగ నరుడు యిహము మరిచె.

మూలమయ్యె నదియె మొరటుతనంబుకు
ఆపదలకు నదియె ఆదియయ్యె
అహమునన్నదాని అధిగమించగలేక
దాసుడయ్యె నరుడు దగ్ధమయ్యె.

ఫ్యాక్షనన్నదొకటి ప్రభవింపకతమైన
అహముపెరుగ జరిగె నాగడాలు
కూలె కాపురాలు తూలె సౌభాగ్యాలు
వల్లకాడులయ్యె, పల్లెటూళ్ళు.

కరములందుపూని కత్తులు, బాంబులు
కరకు తనము నడుప కదలినారు
మానవతను మరచి మారణ హోమాలు
చేసినారు తలలు కోసినారు.

ప్రాణ భయమునూని పరుగెత్తు వాండ్రను
తరిమి తరిమికొట్టి తలలు నరికి
చేతబట్టి తలలు చిందులు త్రొక్కుచు
మంట కలిపినారు మానవతను.

రాక్షసత్వమిపుడు రాజ్యమేలుచునుండె
పగలు సెగలురేగి రగులుచుండె
చిత్తమందు చేరె చెత్తచెదారంబు
కనికరంబు కదలి కదలి కలిసె.

కొంపలన్ని కూలె కొల్లేరులయిపోయె
కాపురాలు కూలె కంపు మిగిలె
పచ్చదనముమాసె పల్లె పట్టులయందు
పంట లెచట ? మందు మంటలచట.

ముచ్చటించబోరు మునిమాపులందున
రచ్చబండ మీద మచ్చుకైన
పాడిపంటగూర్చి పల్లెవాండ్రలిపుడు
రాజకీయములన రక్తినేడు.

ఫాక్షనన్నపాము పగఁబూని కాటేయ
పతులు సుతులు కూల మతులుపోవ
బ్రతికియున్న సతులు బితుకు బితుకుమంచు
గొల్లుమనగ నెవడు గోడు మాన్పు.

విధవరాండ్రజేసి వీధిని బడత్రోయ
దిక్కు మొక్కులేక దిగులుపడుచు
వెక్కి వెక్కి యేడ్చు వెలదుల కన్నీరు
తుడుచునెవడు వాండ్ర గోడుమాన్పు.

కాపురాలు కూలి కలలు కల్లలవగ
కుమిలియేడ్చు సతుల క్షేమ మరయ
ముందు కెవడు వచ్చు మోదంబుజేకూర్చు
కడుపు కింతపెట్టు కనికరించు.

బోసిమెడల తోడ బోడిగుండులతోడ
కళలు తరిగినట్టి కళ్ళతోడ
అడుగు యడుగు నందు నగుపింతు రతివలు
వారివైపు చూడ వంతకల్లు.

పగలు సెగలు మాన పాపబుద్ధిని మాన
ఇరుగు పొరుగువాండ్ర నిష్ఠపడిన
మనసు పెద్దదవ్వ మాలిన్యమరిగిన
ఫ్యాక్షనన్నదపుడు పారిపోవు.

అన్నదమ్ములమను ఆదరభావంబు
పెరుగ పెరుగ యిరుకు తరుగతరుగ
రచ్చలణుగనపుడు రాయల సీమలో
అంతరించు ఫ్యాక్షనన్న దంత.

(రాయలసీమ ఫ్యాక్షన్ గొడవలు గుండెల్ని కదిలించగా మనసు నుండి పెల్లుబికిన భావ పరంపరలకి అక్షరాకృతి యిది)

# శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మంగారు

– ఎ. వేంకటేష్
యం.ఇ.సిఎస్. (ద్వితీయ)

*రత్నాకరాధౌతపదాం హిమాలయ కిరీటినీమ్ ।*
*బ్రహ్మరాజర్షిరత్నాఢ్యాం వందే భారతమాతరమ్ ॥*

ఆధ్యాత్మికత విషయంలో, భారతదేశమే యుగ యుగాలుగా ప్రపంచానికి మార్గదర్శిగా ఉంటోంది. ఇక్కడ ఎందరో రాజర్షులు, బ్రహర్షులు రూపొందారు. భగవంతుడే అనేక సమయాల్లో మానవ రూపంలో వచ్చి ఈ దేశములోనే మార్గదర్శనం చేయడం జరిగినది. భగవదంశంతో ఆంధ్ర దేశములో జన్మించిన మహానుభావుడు "శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మంగారు".

పోతులూరి వీరబ్రహ్మం 1608-1693 మధ్య కాలంలోని వారు. అతని తల్లి పేరు ప్రకృతాంబ, తండ్రి పరిపూర్ణయాచార్యుడు. అతడు పుట్టిన కొద్దికాలానికే తల్లిదండ్రులు మరణించారు. కొన్నాళ్ళు అత్రి అనే ముని ఆ బాలుణ్ణి పెంచి, బిడ్డలు లేని వీరభోజాచార్యుడు, వీరపాపమాంబ అనే దంపతులకు పెంచుకొమ్మని ఇచ్చాడు. వీరభోజయాచార్యుడు కుమారుడికి ఉపనయనం చేసి వేదాది విద్యలు చక్కగా నేర్పాడు. అటు తరువాత ఆయన మరణించగా, తల్లి అనుమతితో వీరబ్రహ్మం అడవులకు పోయి తపస్సు చేశాడు. కందిమల్లయపల్లె గ్రామంలో మఠం నిర్మించుకొని జనులకు హితబోధ చేయసాగాడు. గోవిందమ్మ అనే ఆమెను వివాహమాడి బిడ్డలను కన్నాడు. ఆదర్శ గృహస్థుడిగా ఉంటూనే రాజయోగిగా పేరు ప్రతిష్టలు సంపాదించుకొన్నాడు.

వీరబ్రహ్మం కాలజ్ఞానం అనే గ్రంథాన్ని రచించాడు. అందులో రాబోయే కాలంలో జరుగబోయే విషయాలు, జనులు ఎంత జాగ్రత్తగా మసలుకోవాలో చెప్పాడు. కాలజ్ఞానంలో కొన్ని సూక్తులు వచనంగాను, కొన్ని తత్వగేయాలుగాను ఉన్నాయి.

## కాలజ్ఞానంలో తెలుపబడిన విషయాలు :-

**1. "కలౌపంచ సహస్రేషు జాయతే వర్ణసంకరః**

కలియుగము 5000 సం॥ జరిగిన పిమ్మట కులాంతర వివాహాలు జరుగుతాయి. సాంప్రదాయక కులవ్యవస్థ కుంటుబడుతుంది.

**2. ఉత్తరదేశమున వైశ్య కులమందు**
**ఉత్తమ గంధొకడు బుట్టేనయా**
**సత్తుగ పూజలు జేసేరయా ॥హరిగోవింద॥**

ఈ గోవింద వాక్యములు తనకు తర్వాతి కాలంలో జన్మించే జాతిపిత మహాత్మా గాంధీజీగారిని ఉద్దేశించి బ్రహ్మంగారు తెలిపారు.

**3. ప్రభవ పార్థివ మధ్య పరదేశములన్ని**
**బలు ప్రళయముల చేత నిండేనియా**
**ప్రభువీర వసంతరాయులొచ్చెడిలోగా**
**ప్రళయములన్నియు పండేనయా ॥హరిగోవింద॥**

ప్రభవ (1987-1988) మరియు పార్థివనామ (2005-2006) సంవత్సరముల మధ్యలో ప్రళయములు రాగలవని బ్రహ్మంగారు తెలిపారు. అలాగే అనేక దేశాల్లో ఇబ్బందులు కలిగాయి.

## జరుగబోయే విషయాలు :-

1. ఆకాశం ఎర్రనౌతుంది, ఆరుమతములొక్కటవుతాయి, నిప్పులవాన కురుస్తుంది, నెల్లూరి సీమ నీటిమయ మవుతుంది. జనులు కత్తులతో కొట్లాడు కొంటారు. నేలమీద నెత్తుటేరులు పారుతాయి, ఏడు గ్రామములకొక గ్రామము, ఏడిండ్లకు ఒక్క ఇల్లు మిగులుతుంది.

2. పార్వతి కంటనీరు కారుతుంది, బసవేశ్వరుని కంట నీరు కారుతుంది. మహాదేవుడి జడలెగసి ఆడుతాయి. కప్ప కోడి కూత కూస్తుంది. ఉప్పుగుండూరులో ఉత్పాతాలు పుడతాయి.

3. ధరణి తలమంతా తల్లక్రిందులవుతుంది. అప్పుడు సమాధి పగులగొట్టుకొని వీరభోగవసంతరాయలు వచ్చును.

**బ్రహ్మంగారు ప్రతిపాదించిన పంచ బ్రహ్మల తత్వం**

ఈ సృష్టి 16 కోట్ల సంవత్సరాలకు పూర్వం ఏర్పడినది. ఇందులో మొట్టమొదటగా విశ్వవిరాట్ పురుషుడు ఆవిర్భవించాడు. ఈ విరాట్ పురుషునికి 5 తలలు ఉన్నవి. ఆ ఐదు తలలను పంచబ్రహ్మలుగా కాలజ్ఞానకర్త పేర్కొనడం జరిగింది. ఈ తత్వాన్ని బ్రహ్మాండ పురాణంలోని లలితా సహస్రనామాలు సమర్థించాయి. మనుబ్రహ్మ, మయబ్రహ్మ, త్వష్టబ్రహ్మ, శిల్పిబ్రహ్మ, విశ్వజ్ఞబ్రహ్మలు పంచబ్రహ్మలుగా చెప్పబడ్డారు.

**పంచేంద్రియాల వివరము :-** శ్రోత్రాదులు 5 అనగా జ్ఞానేంద్రియ పంచకములు అనగా చెవులు, చర్మము, నాలుక, ముక్కు, కన్నులు. వీటిని బ్రహ్మంగారు ఇలా వివరించారు.

చెవులు ఆధ్యాత్మ. వినవచ్చేది అదిభూతం. శబ్ద రూపమైన వాయువుతో కూడిన ఆకాశం అధిదైవతం.

చర్మము అధ్యాత్మ. చర్మమునకు సోకిన స్పర్శ అధిభూతం. ఈ వస్తువు నన్ను సోకెనని తెల్పే వాయువు అధిదైవతం.

కన్నులు అధ్యాత్మ. కానవచ్చే వస్తువు అధిభూతం. కనుపింపజేయు సూర్యుడు అధిదైవతం.

నాలుక అధ్యాత్మ. షడ్రుచులను తెలిసికొనుట అధిభూతం. రుచులను తెలియజేయు వరుణుడు ఆధిదైవతం.

ముక్కు అధ్యాత్మ. సుగంధదుర్గంధాలు అధిభూతం. వాటిని తెలియజేయు భూమి అధిదైవతం. ఇవి జ్ఞానేంద్రియ పంచకాలుగా వీరబ్రహ్మేంద్రులు తెలిపారు.

**బ్రహ్మంగారు తెలియజేసిన ఆత్మతత్వ సాధనా వివరణ**

యోగీశ్వరులకు పరబ్రహ్మను దర్శనము చేసే నిమిత్తమై బ్రహ్మంగారు నాలుగు యోగములు, నాలుగు ముద్రలు, యేర్పరచినారు. మంత్రయోగము, లయయోగము, హఠయోగము మరియు రాజయోగములు నాలుగు యోగములుగాను షణ్ముఖ, ధ్యానముద్ర, శాంభవీ ముద్ర, రాధాముద్రలు నాలుగు ముద్రలుగాను చెప్పబడినాయి.

**సాధనాక్రమము :-** పాపపు పుంజముతో కూడిన మనుష్యుడు కించిత్ జ్ఞానము కలిగి శుచియైన స్థలమందు పద్మాసనం వేసుకొని కూర్చుండి దృష్టులు అనగా చూపులు రెండు నాసికాగ్రము నందు నిలిపి కన్నులు మూసి తనకభీష్టమగు దేవతను ధ్యానము చేయుచూ గాయత్రి మొ॥న మహామంత్రముల జపముచేసి బ్రహ్మార్పణం చేసేది. ఇట్లు ఉండేది మంత్రయోగం ఇదే ధ్యానముద్ర.

ఇక లయయోగము రెండు చేతులకు ఉండే రెండు తర్జని వ్రేళ్ళచేత రెండు చెవుల రంధ్రాలు లెస్సగా మూస్తే అచట మహాధ్వని వినబడును. ఆ ధ్వని వినంగా వినంగా 1) చిరుగజ్జలనాదం, 2) గొప్పగజ్జెలనాదం, 3) ఘంటానాదం, 4) శంఖనాదం, 5) వీణానాదం, 6) తాళనాదం, 7) వేణునాదం, 8) మృదంగనాదం, 9) భేరినాదం, 10) మేఘనాదం అనే దశవిధ నాదాలుగా తెలుస్తుంది. ఇందులో 9 నాదాలు త్యజించి 10వదైన మేఘనాద మభ్యసించి వినంగా మనస్సు అచటలీనమగును. ఇదియే మోక్షమునకు హేతువు.

**కాలజ్ఞానంలో ప్రకటించబడిన వీరబ్రహ్మంగారి రాక**

నందననామ సంవత్సరము కార్తీక శుక్ల ద్వాదశి నాటికల్లా వీరభోగవసంతరాయులుగా తాను ఉద్భవిస్తానని బ్రహ్మంగారు తెలిపారు. ఖర, నందన మధ్య కాలములో భరణి నక్షత్రముతో కూడిన ఆదివారమునాడు సమాధిని పగులగొట్టుకొని రాగలనని బ్రహ్మంగారి కథనం. ఇది 2012-2013 మధ్య జరుగునని కొందరి అంచనా.

**ముగింపు :-** వీరబ్రహ్మంగారు కులమెంచగానేల గుణమె కారణము అంటూ సద్గుణములకిచ్చిన ప్రాధాన్యం సాంప్రదాయంగా వస్తున్న కులాలకు ఇవ్వలేదు. సామాజిక న్యాయం స్థాపించుటకు, మత సామరస్యం నెలకొల్పడానికి వీరబ్రహ్మం ఎంతగానో ప్రయత్నించారు. కాలజ్ఞానకర్తగా, భవిష్యత్‌ద్రష్టగా, యోగిగా, తత్త్వవేత్తగా, బ్రహ్మజ్ఞానిగా వీరబ్రహ్మేంద్రులు నిత్యవంద్యులైనారు.

# మాతృప్రేమ...

– జి. విఘ్నేశ్వరి
బి.కామ్.(తె.మీ.) ప్రథమ

ప్రేమే జీవితం, ప్రేమే ప్రపంచం అంటారు కొందరు. ప్రేమ గొప్పదా ! జీవితం గొప్పదా ! అంటే ఖచ్చితంగా చెప్పడం కష్టం. దేనికి అదే సాటి. జీవితం అంతం. ప్రేమ అనంతం. జీవితానికి జననం, మరణం ఉంది. కాని ప్రేమకు జననం (ప్రారంభం) ఉంది. మరణం (అంతం) అనేది ఉండదు. అయినప్పటికి ప్రేమ జీవితంలో అంతర్భాగంగా ఉంటుంది. వ్యక్తులు మరణించినా వారి ప్రేమ గాథలు కథల రూపంలో నెమరు వేసుకొంటున్నాం. అదే అమర ప్రేమ.

జీవితంలో వివిధ వ్యక్తుల నుండి మనం పొందే ప్రేమ, మనం ఇతరులకు పంచే ప్రేమనుబట్టి ఉంటుంది. తల్లి, తండ్రి, భార్య, భర్త, అన్న, చెల్లి, స్నేహితులు – ఇలా వివిధ బంధాల మధ్య ప్రేమ అనేక విధాలుగా ఉంటుంది. ప్రపంచంలో ఒక ప్రదేశం, ఒక సందర్భం, చేసే వృత్తి, పొందే వస్తువులను బట్టి కూడ ప్రేమలో స్థాయిలు ఏర్పడతాయి. ఏది సాధించాలన్నా ప్రేమ అవసరం.

జీవితంలో అన్నిటికంటే గొప్ప ప్రేమ తల్లి ప్రేమగానే పరిగణిస్తున్నారు. అమ్మ అందరికన్నా మిన్న తల్లి తన పిల్లలకు నవమాసాలు మోసి కనిపెంచుతుంది. పిల్లల కోసం సర్వస్వం ధారపోస్తుంది. చివరకు ప్రాణాలు కూడా పణంగా పెడుతుంది. జీవితాన్ని ప్రసాదించిన మాతృమూర్తి ఋణం తీర్చుకోవాలంటే కొంతమంది ఏడు జన్మలు ఎత్తాలి అంటారు. ఒక జన్మకు ఏడు జన్మలు ఎత్తితే ? మళ్ళీ ఆరు జన్మల ఋణం మిగిలిపోతుంది. ఆరు జన్మల ఋణం తీర్చుకోవాలంటే 6×7=42 జన్మలు ఎత్తాలి. అలా ఎన్ని జన్మలు ఎత్తినా తల్లి ఋణం తీర్చుకోలేమని అర్థం. అలాంటి తల్లి ప్రేమను విమర్శించేవాడు, శంకించేవాడు, తల్లిని హింసించేవాడు జంతువు కన్నా హీనమైనవాడు. మళ్ళీ ఎన్ని జన్మలుఎత్తినా మనిషిగా పుట్టలేడు. చనిపోయినా తల్లి మనస్సు బిడ్డల కోసం ఎంత పరితపిస్తుందో ? భార్యకు వచ్చిన జబ్బు నయం కావాలని తల్లిని వధించి గుండె, ప్రేగులు తీసుకు వస్తూ అకస్మాత్తుగ ఎదురుదెబ్బ తగిలి క్రిందకు పడిపోయిన కొడుకును చూచి తల్లి గుండె నుంచి "జాగ్రత్త బాబూ! దెబ్బ తగిలిందా! సరిగా చూసుకో" అని వినిపించిందట. అందుకే సప్తసముద్రాల కన్నా అమ్మ మనస్సు మిన్న. సిరులు, మణులు అమ్మ ప్రేమకు సరితూగలేవంటారు.

*"అమ్మలేని జీవితం అలలులేని సముద్రం*
*అమ్మ చూపే ప్రేమ అమృతానికి చిరునామా !"*

అమ్మ ప్రేమకు ఎంతయినా విలువ కట్టలేము. అమ్మ మనస్సులో మనం ఎంత ఎదిగినా చిన్న పిల్లలమే. తనకు ఎన్ని కష్టాలు వచ్చినా బాధపడని తల్లి బిడ్డకు చిన్న దెబ్బ తగిలితే తల్లడిల్లిపోతుంది. మనకు జీవం పోసేది స్వర్గంలో బ్రహ్మ అయితే భూమి మీద మనకు జీవంతో జన్మనిచ్చేది మన కన్నతల్లి.యుగాలు మారినా తరాలు మారినా, దేశాలు, మతాలు వేరైనా సూర్యచంద్రులున్నంతవరకు తల్లి ప్రేమకు మించిన ప్రేమ వేరొకటి లేదు.

* * * *

# మారిపోయిన సమాజం - మరిరాదా మనకు ఆదర్శ సమాజం ?

— వి. సమీర్‌కుమార్
యమ్.పి.యస్. (తె.మీ) ప్రథమ

భారతదేశమనగానే సంప్రదాయాలు, కట్టుబాట్లు, ఉన్నతమైన విలువలపట్ల గౌరవంచూపడం అనే భావాలు గుర్తుకు వస్తాయి. కానీ క్రమేపీ ఆదర్శాలు లోపిస్తున్నాయి. కాలం గడుస్తున్నకొద్దీ ఈ క్రింది అవలక్షణాలే అధికమౌతున్నాయి.

## కుళ్ళు రాజకీయాలు - రాజకీయ పార్టీ నేతలు

రాజకీయం అంటేనే ఇప్పుడు అందరూ "జూదం" లాగా భావిస్తారు. ఇప్పుడు వున్న ఏ పార్టీ రాజకీయ అధినేతా ప్రజల గురించి ఆలోచించడు. వాళ్ళు మాత్రం హాయిగా, స్వేచ్ఛగా ఏ అడ్డంకులు లేకుండా వుంటే చాలు ఇతరులకు ఏమైనా పర్వాలేదు అనుకుంటారు. ఎలక్షన్స్ దగ్గర పడుతున్నాయనంగా ఆ రాజకీయ నాయకులు ఆడ, మగ, వృద్ధులు, వికలాంగులు, వెనుకబడిన కులాలవారు మరియు రైతులు దగ్గరికి వెళ్ళి మరీ మరీ కోరుతూ...

"అయ్యా ! అమ్మా ! మాకు ఓటువేసి గెలిపించి తీరండి. నాకు ఏ ఎం.ఎల్.ఏ పదవినో లేక మంత్రి పదవినో తెచ్చిపెట్టండి, నేను మీకు తప్పకుండా సహాయం చేస్తాను" అంటూ వేడుకొంటారు. ప్రతి ఇంటిలోని చదువుకున్న అమ్మాయికి, అబ్బాయికి ఉద్యోగం అని, వృద్ధులకు నెలసరి పింఛను, ప్రతి ఇంటికి కలర్ టి.విలు, గ్యాస్ సదుపాయం, మహిళలకు ప్రత్యేక వసతి అంటూ ఎన్నో ఆశలు చూపిస్తారు.

"రైతులు సుఖంగా వుండటానికి 24 గంటలు నీటి సదుపాయం, కరెంటు మరియు ఎరువులు, రసాయనాలు, విత్తనాలు సబ్సిడీ పథకం కింద ఉచితంగా ఇస్తాము అని రైతన్నలకు ఆశలు కలిగిస్తారు. ఓట్లు వేసి గెలిపిస్తే ఆ నాయకుడు 5 సంవత్సరాల కాల వ్యవధిలో ఒక్కసారి కూడా మన ముఖం తిరిగి చూడడు. ఆశపెట్టి నమ్మించి గొంతు కోసే రకం ఈ రాజకీయ నాయకులు.

వృద్ధులకు, వికలాంగులకు పింఛన్ పేరుతో ప్రభుత్వం డబ్బును మంజూరు చేస్తే అది మధ్యలోనే కరిగిపోయి చివరికి ఆ పేదలకు వందరూపాయలకంటే ఎక్కువరాదు. వారి సొమ్ముకు కూడా ఆశపడాల్సి వస్తే వారు ఎలా బ్రతుకుతారు? తమ నాయకుడు ఏదైన గొప్ప పని చేస్తే చాలు ఉదయాన్నే పేపర్ నిండా ఆ నాయకుడి గురించే వుంటుంది. టి.వీల్లోనూ, పోస్టర్లు, ఫ్లెక్సీలు, కటౌట్‌లు ఎన్ని ఆర్భాటాలో, ఎంత హంగామానో! రాజకీయాలు ఇలా కుళ్ళిపోయాయి.

## మోసం :

ఒకప్పుడు మోసం అంటేనే తెలియని సమాజంలో ఇపుడు అదే జీవన విధానమైంది. నాయకులు ప్రభుత్వమిచ్చే పథకాలను తప్పుదోవపట్టిస్తున్నారు. పేదలకిచ్చే సౌకర్యాలను కూడా తామే దోచేస్తున్నారు. చేసే పనిలో, ఇచ్చే వేతనంలో, అమలుచేసే పద్ధతుల్లో ప్రతి చోటా మోసమే. చట్టాలు ధనికులను కాపాడుతున్నాయి. నిరుపేదలకు శాపాలౌతున్నాయి. అన్యాయంగా అమాయకులను మోసం చేసి తాము అందలాలెక్కుతున్నారు. ఇక సమాజం బాగుపడేదెపుడో ?

## అంటరానితనం :

కులమతభేదాలు మనం సృష్టించుకొన్నవే. ఆ దేవుడు అందరికి ఇచ్చినది ఒక్కటే రక్తం. ఏ మనిషినైనా కోస్తే వాడి నుంచి వచ్చేది 'ఎర్ర'గా వుండే రక్తమే కానీ ఎక్కువ కులం వాళ్ళకు వేరొక రక్తం, తక్కువ కులం వాళ్ళకు ఇంకొక రక్తం అంటూ వుండదు. ఈ సమాజంలో ఇంకోరకపు ప్రజలు కూడా వున్నారు. వారు ఎవరో తెలుసా? మనం దారిలో నడిచేటప్పుడు ఎవరైనా రోడ్డుకి ఇరుప్రక్కల భిక్షమెత్తుతూ "అయ్యా, అమ్మా, బాబు, సార్" అని ఎంతో గౌరవంగా పలకరిస్తారే, వారే. కానీ వారిని

చూస్తే ఎక్కడ మనం లోకువౌతామో అని వారిని అసహ్యించుకుంటాము. ఇలా సమాజంలో ఎన్నో విధాలుగా అంటరానితనం వుంది.

**ధనిక - పేదల వ్యత్యాసం :**

డబ్బు చాలా ఎక్కువ వున్నవాడు "ధనికుడని" డబ్బు చాలా తక్కువ వున్నవాడు "పేదవాడు" అని వ్యవహారం. ఈ సమాజంలో పేదవారిని చాలా చులకనగా చూస్తున్నారు. ఉదాహరణకి ఒక యజమాని దగ్గర పనిచేస్తున్న కూలివాడు "అయ్యా ఈ నెలలో మనకు పండుగ వస్తుందిగా నాకు మీయట్లా ఖద్దర్ చొక్కా, పంచె కావాలి అయ్యా" అని అడిగితే కళ్ళు మూసుకుపోయి వున్న ఆ యజమాని "ఏరా! నీకు నేను ఆ చొక్కా తీసిస్తే నీవు పదిమందిలో వేసుకొని తిరిగితే నా పరువు ఏమి కావాలి, తినడానికి నాలుగు గంజి మెతుకులు వేసేదే నీకు ఎక్కువ అందులో నీకు "ఆశ" కూడానా ?" అని ఆ కూలివాడిని ఆడిపోసుకుంటాడు. అసలు పేదవాడికి ఆశలు వుండకూడదా ?

**మతం :**

మనకు స్వాతంత్ర్యం వచ్చి 60 సంవత్సరాలైనా విజ్ఞానం పెరుగుతున్నా మత పిచ్చి మాత్రం మనకు వదలడం లేదు. మతం పేరు, దేవుని పేరు, చెప్పి లేని పోని ఉద్రేకాలు తెచ్చుకొంటున్నాం. ఒళ్ళు తెలియని వెర్రి ఆవేశాలు కల్గుతున్నాయి. రక్తపాతాలు జరుగుతున్నాయి. కుటుంబాలకు కుటుంబాలు నశించి పోతున్నాయి. దేశం ముక్కలౌతుంది. దిక్కులకొకరుగా అయిపోతున్నారు. ఇలా ఎంతకాలం సాగుతుందో?

**స్త్రీలను చులకనగా చూడటం - అసభ్యంగా ప్రవర్తించడం**

మన ప్రాచీనులు స్త్రీలను చాలా గౌరవంగా చూసేవారు. స్త్రీలు ఆదరం పొందినచోట దేవతలుంటారని మన భావం. కానీ, ఇప్పుడు "స్త్రీ అంటే అంగట్లో దొరికే ఆట వస్తువులా" చూస్తున్నారు. మన దేశంలో ఎంతోమంది సైకోలుగాను, శాడిస్టులుగాను, రేపిస్టులుగాను మారుతున్నారు. వీరు స్త్రీలు కనపడితే చాలు తమ పని కానిస్తారు, చివరికి హింసించి హతమారుస్తారు. ఇదేనా మన విద్య మనకు నేర్పింది ?

ఒకడేమో కట్నం ఇవ్వలేదని స్త్రీని హింసించి, క్షోభపెట్టి చంపేస్తాడు. మరొకడు నీవు పరాయి మగాడితో వున్నావు అని లేనిదానిని వున్నదానిగా చెప్పి వారిని నిలువునా మోసం చేస్తాడు. చివరికి ఆ స్త్రీ అవమానం తట్టుకోలేక చనిపోతుంది. ఒక మూర్ఖుడైతే తనకు ఆడపిల్ల పుట్టింది అనే వార్తవింటే చాలు వాడు ఏ బావిలోనో, ఏ కుప్ప తొట్టిలోనో పారేస్తాడు. పాపం అభం శుభం తెలియని ఆ పసికందు చేసుకున్న పాపం ఏమిటో తెలియదు.

ఇప్పుడున్న యువత అయితే మద్యం తాగటం, డ్రగ్స్ అలవాటు చేసుకోవటం అమ్మాయిల వెంటపడి వారిని "ప్రేమ" పేరుతో నిలువునా మోసం చేయడం. వారు ప్రేమించకపోతే "ఏ యాసిడ్ తోనో, వేటకొడవల్లతోనో దాడిచేసి వారిని చంపేయడం చేస్తున్నారు. ఒక్కసారి ఆలోచించండి వారి తల్లిదండ్రులకు మనం కన్నీరు మిగిలిస్తే వారు ఎవరికి చెప్పుకుంటారు.

**ఆదర్శ సమాజం రావాలంటే :**

రాజకీయ నాయకులు కొంతవరకైనా పరహితం ఆలోచించాలి. హంగులకు, ఆర్భాటాలకు లోనుకారాదు. డబ్బే ప్రధానం కాదు. చదువుకున్నవాళ్ళు, తెలివిగలవాళ్ళు అంటరానితనాన్ని పోగొట్టటానికి తమ వంతు సహాయం చేయాలి. ప్రతివారికి ఎదుటివారి కష్టాలు చూసి అర్థం చేసుకొని సాయం చేసే మంచి మనసుండాలి. అణగారిన వారిని, నిరుపేదలను, అంటరానివారిగా చూచే తత్వం పోవాలి. మనిషి ఎలా ఉన్నా మనసు నలుపు కాకూడదు. దేవుడు ఒక్కడే. అతనికే అనంత రూపాలు అని గ్రహించి పరమత సహనం అలవాటు చేసుకొని, ప్రపంచమంతా ఒకే కుటుంబం అనే భావనతో మెలగాలి. ఉన్నతమైన భావాలు పాటించినప్పుడే ఆదర్శ సమాజం వస్తుందనేమాట అక్షర సత్యం.

# సమాజంలో యువత పాత్ర...

– కె. రమేష్
యం.పి.యస్. (తె.మీ) ప్రథమ

బాల్య ప్రాయం దాటి 20-25 ఏళ్ళ వయసులో ఉన్న వారందరు యువతగా పరిగణింపబడుతారు. అప్పుడు వారు అంతా నాకే తెలుసు అనుకుంటారు. కానీ, ఏమీ తెలీదు. సమాజాన్ని చూసి నేర్చుకోవడం కాకుండా సమాజమే నన్ను చూసి నేర్చుకోవాలి అన్న ధీమా వీరిలో ఉంటుంది. ఈ వయస్సులో ఉండే యువకుడు నేనే హీరో, నా తరువాతే ఎవరైనా. నాది మాత్రమే సరియైన మార్గమని అతి విశ్వాసాన్ని కల్గి వుంటారు.

యువత చెడిపోవడానికిగల కారణాలు : 1) ప్రేమ, 2) డబ్బు, 3) చెడు స్నేహాలు, 4) సినిమాలు, 5) రాజకీయాలు

**ప్రేమ :** జీవితంలో ఈ స్థితిలో వున్న వారికి ఎవరైనా అందంగా కనిపిస్తే ఏ ఆలోచన లేకుండా వారిని ప్రేమించాలని అనుకొంటారు. అలా ప్రేమలో పడి యువత తన ఆశయాలను వదిలి, విపరీతంగా ప్రవర్తిస్తూ సమాజంలో వారు చెడ్డ అవడమే కాకుండా ప్రేమంటే చెడిపోవడం అనే భావాన్ని కలుగజేస్తున్నారు. యువతలో కొంతమంది ప్రేమను తెలియపరచినపుడు ఎదుటవారు 'కాదు' అంటే వారిని హింసించైనా వారి ప్రేమ పొందాలని క్రూరంగా ఆలోచిస్తారు.

**డబ్బు :** యవ్వనంలో ఎంత డబ్బు వున్నా చాలదనిపిస్తుంది. ఎందుకంటే వారు విలాసవంతమైన జీవితాన్ని అనుభవించాలని, తాను మాత్రమే సమాజంలో ప్రత్యేకంగా ఉండాలని భావిస్తారు. డబ్బు ఎరచూపి అందరినీ తమ చుట్టూ త్రిప్పుకొంటారు. ధనంతో సాధించలేనిది ఏదీ లేదని వారి ఆలోచన. చదువుకు సంపాదనే లక్ష్యమని వారి ఉద్దేశ్యం.

**స్నేహం :** యువత సైకోలుగా మారడానికి వారిని ప్రోత్సహించే స్నేహితులే కారణం. ఇలాంటి చెడు స్నేహాలు తోడవడంవల్ల సమాజంలో యువత రౌడీలుగా, గూండాలుగా, నేరస్థులుగా మారుతున్నారు. దీనికి ప్రేమ పేరుతో కిరాతకంగా చంపబడిన 'ఆయేషా' ఒక నిదర్శనం.

**సినిమాలు - మీడియా :** ప్రస్తుత సమాజంలో విడుదలైన చిత్రాలలోని నీతిని వదిలేసి, అందులోని చెడును మాత్రమే యువత గ్రహించడం వల్ల ధూమపానం, మద్యపానం, డ్రగ్స్‌లాంటి వాటికి బానిసలౌతారు. యువత చెడిపోవడానికి ప్రసార మాధ్యమాలు కూడా ఒక కారణం.

ఈ కాలంలో టెక్నాలజీనీ ఉపయోగించి కొంత మంది స్మగ్లింగ్ చేయడం, ఇంకా మన దేశ రహస్యాలను పరాయి దేశాలకు చేరవేయడం ద్వారా దేశ ద్రోహులుగా కూడా మారుతున్నారు.

**రాజకీయాలు :** ఇలాంటి స్థితిలో వున్న యువతను రాజకీయ నాయకులు తమ చేతిలో కీలుబొమ్మల్లా ఆడిస్తున్నారు. తెలంగాణ, సమైక్యాంధ్ర ఉద్యమాల్లో పాల్గొన్న యువత ఏదో సాధించాం అనుకుంటారు. తాము కోల్పోయేది తమ భవిష్యత్తే అని గమనించలేకపోతున్నారు.

**యువత అభివృద్ధి :** యువత ఈ పోటీ ప్రపంచంలో ఇంకా పోటీతో ముందుకు సాగాలి. అన్ని రంగాలలో ముందుండాలి.

విద్య, వైజ్ఞానిక సామాజిక రంగాలలో ప్రతి ఒక్కదాన్ని యువత అర్థం చేసుకోవాలి. తగిన సమయంలో ప్రతిభను చూపాలి. మనసును కరిగించే సాహిత్యాన్ని, సమాజానికి అవసరమయ్యే సాహిత్యాన్ని యువత అందించాలి. రవీంద్రనాథ్ ఠాగూరు వంటి వారిని యువత ఆదర్శంగా

గ్రహించాలి. భారత దేశంలో వైజ్ఞానిక రంగంలో లబ్ధప్రతిష్ఠులైన నోబుల్ బహుమతి పొందిన సి.వి.రామన్, చంద్రశేఖర సుబ్రహ్మణ్యం వంటివారు యువతకు ఆదర్శంకావాలి.

ఇంతకు ముందు ఏదైన ప్రయోగాలు చేసినప్పుడు అంటే కృత్రిమ ఉపగ్రహాలు ప్రయోగించడం, రాకెట్స్‌ని అంతరిక్షంలోకి ప్రయోగించడానికి చైనా, రష్యా, దేశాలకు వెళ్ళి చేసేవారు. కాని ఇప్పుడు భారతదేశంలోనే బెంగళూరులో ఇస్రో అనే సంస్థను నెలకొల్పి, శ్రీహరికోటలో రాకెట్ లాంచింగ్ స్టేషన్ ఉండడం ద్వారా ఇండియా చాలా అభివృద్ధి సాధించిందని చెప్పవచ్చు. ఈ విషయంలో మన శాస్త్రవేత్తల కృషిని యువత ఆదర్శంగా తీసుకోవాలి.

క్రికెట్‌లో సచిన్, టెన్నిస్‌లో సానియా లాంటి గొప్ప ఆటగాళ్ళను ఆదర్శంగా తీసుకొని యువత క్రీడారంగంలో అభివృద్ధి సాధించాలి. నోబెల్ శాంతి బహుమతిని పొందిన మదర్‌థెరిసా సామాజిక సేవలు యువతకు ఆదర్శంకావాలి.

ఏదైనా సాధించాలన్నా అదే విధంగా విధ్వంసం సృష్టించాలన్నా ముఖ్యమైన పాత్ర యువతదే. అందువల్ల యువత నిర్మాణాత్మక దిశగా పయనిస్తే దేశం ముందడుగు వేస్తుంది.

**యువతకు ప్రోత్సాహం కావాలి :** యువత సమాజంలో ఏదైన సాధించాలంటే వారికి మొదట కావలసింది వారి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం. ఎందుకంటే ఏదైన సాధించాలన్న దానికి ముందే బయట నుండి ఎన్నో విమర్శలు వస్తాయి. అలాంటి పరిస్థితిలో ఇంట్లోవారు కూడా అర్థం చేసుకోకుండా వుంటే వారు ఏమీ సాధించలేరు. అందువల్ల తల్లిదండ్రులు యువత చేసే మంచి పనులను గుర్తించి వారికి వెన్నుదన్నుగా నిలవాలి. అప్పుడే యువత అన్ని రంగాలలో ప్రగతిని సాధించగల్గుతుంది.

* * * *

# విజయం

**– యన్. శివజ్యోతి**

బి.జడ్.సి. (తె.మీ) ప్రథమ

ఈ ప్రపంచంలో ప్రతి ఒక్క మనిషి పుట్టినప్పటి నుండి మరణించేంత వరకు విజయం కోసం ప్రాకులాడుతూనే వుంటారు.

**"విజయం అంటే గమ్యం కాదు,**
**అది ఒక "నిరంతర ప్రయాణము"**

వ్యక్తులు, సంస్థలూ, దేశాలూ, విజయం సాధించటం అపజయం పాలవటం మన ప్రపంచ చరిత్రలోనే చూస్తూనే వున్నాం. ప్రతి వ్యక్తి, సంస్థ, దేశం విజయం సాధించాలని కోరతారే కానీ, అపజయం కావాలని కోరుకోరు. విజయం అనేది కోరుకున్నంత మాత్రాన రాదు. చాలామంది విజయం కోరుకొని కూడా అపజయం చవి చూస్తారు. అపజయానికి కారణాలు తెలుసుకొని వాటిని పునరావృతం కాకుండా చూసుకుంటే విజయానికి దగ్గరవుతాం. విజయం సాధించిన వ్యక్తుల మీద అనేక పరిశోధనలు జరిగాయి. విజయం సాధించిన వారందరూ కొన్ని ప్రాథమిక సూత్రాలు పాటించారు. అవి చాలా సరళమైనవి. కానీ వాటిని నిరంతరము పాటించాలి. ఆ సూత్రాలు మన జీవితంలో భాగాలు కావాలి.

**అసలు విజయం అంటే ఏమిటి ?**

విజయం అనునది ఒక్కొక్కరి దృష్టిలో ఒక్కొక్కటి. కొందరి దృష్టిలో ధనం సంపాదించటం విజయం. కొందరి

దృష్టిలో గుర్తింపు, పేరు, ప్రతిష్టలు. కొందరి దృష్టిలో మనశ్శాంతి, కొందరి దృష్టిలో స్వేచ్ఛగా ఉండడం. కనుక విజయం వ్యక్తిగతం.

ఏ వ్యక్తీ ఒక విషయంలో విజయం సాధించి ఊరుకోడు, దృష్టి మరో విషయం వైపు మళ్ళుతుంది. అందుకే "విజయం ఒక ప్రయాణము" మధ్యలో సాధించే ఏ విజయాలైనా దాని మజిలీలు మాత్రమే. ప్రతి మజిలీ, ఆ వ్యక్తి జీవితానికి కొత్త కొత్త అర్థాలు కలిగిస్తుంది. "విజయం అంటే వ్యక్తిగా మరో మెట్టు ఎక్కటం. ఒక విజయం ఒక వ్యక్తికే కాదు. మానవాళికంతకూ సంతోషదాయకమే. ఎందుకంటే ఒకరి విజయం మరొకరికి స్ఫూర్తి. అలా ఎదిగినందునే మానవాళి ఇవాల్టి దశలో వుంది. విజయవంతంగా జీవించటానికి వ్యక్తిగత క్రమశిక్షణ కావాలి. విలువలపై ఆధారపడ్డ పట్టువీడని ఆచరణ కావాలి.

### విజయం సాధించక పోవటానికి కొన్ని కారణాలు:

1. ఏం కావాలో నిర్ణయించుకోకపోవటం.
2. అహంకారం, అభిమానాల తేడా తెలియక పోవటం.
3. ఓడిపోతామనే భయం.
4. స్వశక్తి మీద నమ్మకం లేకపోవటం.
5. సరైన పథకం ప్రకారం పనిచేయక పోవటం.
6. లక్ష్యం లేకపోవటం.
7. స్థిర నిర్ణయం లేకపోవటం.
8. శిక్షణ లేక పోవటం.
9. సడలని పట్టుదల లేకపోవటం.
10. లక్ష్యం మీద దృష్టి నిలకడలేక పోవటం.

### గెలుపు - ఓటమి :

జీవితమంటేనే ఒక పోరాటం. గెలుపు అంటే పోరాటం తరువాత వచ్చేది. గెలిచినా, ఓడినా ప్రతి పోరాటం, మనల్ని నిగ్గుతేలుస్తుంది. ఆ పోరాటాలే మనల్ని విజయానికి తగ్గట్టుగా తయారు చేస్తాయి. తరువాత మనల్ని విజయం వరిస్తుంది. ఇది ప్రకృతి నియమం.

ఏ కష్టం లేకుండా ఎవరూ విజేత అవలేరు. సమస్య లేనివాళ్ళుండేది, స్మశానాల్లోనే. క్షణికమైన నిరాశ, నిస్పృహ వుండటం మానవ సహజం. అలాఅని పోరాటం ఆగవలసిన పని లేదు. మొట్టమొదటసారి ఏ పనైనా కష్టమే. దానికి కారణం లోపల నమ్మకం లేకపోవటం. అదే పని ఒకసారి చేశాక తేలికైపోతుంది. ఎందువలన ? దానిలో లోటుపాటులు తెలుస్తాయి. ఫలితం వస్తుందన్న నమ్మకం. ప్రతి విజయం వెనుక ఓటమి గాథలూ, నేర్చుకొన్న పాఠాలు వుంటాయి. ఇందుకు అబ్రహం లింకన్ సాధించిన విజయాలే నిదర్శనం. ఆయన తన –

21వ ఏట వ్యాపారంలో దెబ్బతిన్నాడు.

22వ ఏట ఎమ్.ఎల్.ఏ. పదవికి పోటీచేసి ఓటమి చవిచూశాడు.

24వ ఏట మళ్ళీ వ్యాపారంలో దెబ్బతిన్నాడు.

26వ ఏట నరాల ఒత్తిడికి గురై అనారోగ్యం పాలయ్యాడు.

34వ ఏట మళ్ళీ ఎన్నికల్లో ఓడిపోయాడు.

45వ ఏట సెనేట్‌కి పోటీ చేసి ఓడిపోయాడు.

49వ ఏట సెనేట్ ఎన్నికల్లో మళ్ళీ ఓడిపోయాడు.

52వ ఏట అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు.

లింకన్ తన జీవితంలో ఎప్పుడైనా ఓటమికి బాధతో కూలబడితే అంత గౌరవప్రదమైన అధ్యక్షపదవికి ఎన్నికయ్యేవాడు కాదు.

### ఎవరు విజేతలవుతారు ?

1. నేను గెలుస్తాను, 2. నేను గెలవగలను, 3. గెలుపు నా హక్కు, 4. గెలవటానికే పుట్టాను, 5. తాత్కాలిక అడ్డంకులు శాశ్వత గెలుపుకి పునాదులు, 6. అవి నన్నాపలేవు. నేనాగను, 7. ఎందుకంటే నా నిర్ణయం సుస్థిరం, 8. నా జీవితానికర్థం, సార్థకత, నా గెలుపే. 9. నా గెలుపు నా బాధ్యత, నా నిర్ణయం. ఈ

విషయాలు ఎవరి అంతః చేతనంలో నిండి, ఎవరి స్వభావాన్ని ఆచరణని మార్చగలుగుతుందో, అపుడు వారే విజేతలవుతారు.

## విజేతకుండే ముఖ్యమైన లక్షణాలు :

1. తపన, 2. పట్టుదల, 3. బాధ్యత, 4. కష్టపడి పనిచేయటం, 5. ఆశావహ దృక్పథం.

ఓ యువకుడు సోక్రటీసుని విజయానికి రహస్యమేమిటని అడిగాడు. సోక్రటీసు అతనిని తనతోపాటు ఓ నదిలోనికి తీసుకెళ్ళాడు. ఇద్దరూ పీకల్లోతు నీళ్లల్లో మునిగి వున్నారు. ఉన్నట్టుండి సోక్రటీస్ ఆ కుర్రాణ్ణి జుట్టుపట్టుకొని నీళ్లలో ముంచేశాడు. ఆ యువకుడు తలెత్తటానికి ప్రయత్నించిన కొద్దీ సోక్రటీస్ అతని తలని మరింత గట్టిగా నీళ్లలో అదిమి పట్టాడు. నిమిషం ఆగాక సోక్రటీస్ తన పట్టుసడలించాడు. ఆ యువకుడు తల నీళ్లల్లోంచి పైకెత్తి గుండెల నిండా గాలి పీల్చుకున్నాడు.

ఆ కుర్రాడు స్థిమిత పడ్డాక సోక్రటీస్ అడిగాడు. "నీ తల నీళ్లలో వున్నప్పుడు నువ్వు దేని కోసం పరితపించావు ? "గాలికోసం" అన్నాడు కుర్రాడు. విజయం కూడా అంతే, తీవ్రమైన పరితాపం తోనే విజయం లభిస్తుంది. ఏదో యథాలాపంగా కోరుకుంటే కుదరదు. నీళ్లల్లో మునిగినపుడు గాలికోసం ఎంత తీవ్రంగా ప్రయత్నించావో, విజయానిక్కూడా అలాగే పరితపించాలి". "తీవ్రమైన కోరిక విజయానికి తొలిమెట్టు"

నిజాయితి, వివేకం ఈ రెంటి మీద ఆధారపడటమే పట్టుదల. సంపద, విజయం రెండు మన ఆలోచనల మీద నిర్ణయం మీద ఆధారపడి ఉంటాయి.

సరైన పరిస్థితులు ఎప్పుడూ వుండవు. సంసార సాగరంలో ఆటుపోట్లు సహజం. అట్లా అని ఓడని లంగరేసి రేవులో ఉంచితే ఓడ నిర్మాణానికే అర్థం లేదు. పోనీ ఓడని సముద్రపు ఆటుపోటులకు వదిలితే అది గమ్యం లేకుండా ప్రయాణిస్తుంది. దానికి తెరచాప, తెడ్డు, చుక్కాని ఏర్పాటు చేస్తే దాని గమనం మీ చేతిలో వుంటుంది. ఒక దిశా నిర్దేశం ప్రకారం ప్రయాణిస్తే అది గమ్యం చేరుతుంది. అలాగే జీవితాన్ని లక్ష్యం వైపు తీసుకెళ్ళటం మనిషి బాధ్యత. కష్టాలు, అడ్డంకులే పట్టుదలతో వున్న మనిషి మస్తిష్కానికి పదును పెడతాయి.

పట్టుదలతో నిర్ణయం తీసుకున్నాక ఆపదలకు వెరవరు. వారి లక్ష్యం ఆపదలకంటే పెద్దది. అందువల్ల నిద్రాణమైన వారి శక్తి, యుక్తులు వెచ్చించి ఆపదలు దాటుతారు.

ప్రతి ఒక్కరికీ విజయం సాధించాలనే కోరిక ఉండాలి. బాధ్యతగా పట్టుదలతో కృషి చేయాలి, గమ్యం చేరేవరకు విశ్రమించరాదు. అప్పుడే విజయం మనల్ని వరిస్తుంది.

* * * *



# అధికార ప్రదానమే మహిళలకు బలం

– బి. దీప్తి
బిటి.యమ్.సి. తృతీయ

మహిళలు అన్ని రంగాలలో మగవారితో సమానంగా పోటీ పడుతున్నారని కొందరు పెద్దలు చెబుతున్న మాటలు కేవలం చెప్పుకోవడానికే. వాస్తవంలో పరిస్థితి అంత ప్రోత్సాహకంగా లేదని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూ.ఈ.ఎఫ్) యొక్క నివేదిక పేర్కొంది. విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, రాజకీయాలు ఇలా ఏ రంగములోనైనా పురుషులకు చాలా దూరంలో మహిళలు ఉన్నారని స్పష్టం చేసింది.

మనదేశంలో పాఠశాలలో బాత్‌రూమ్‌లు లేకపోవడం సహా ఆడపిల్లల చదువుకు అన్నీ ఆటంకాలే. కనీస వసతులు లేని పాఠశాలలు ఆడపిల్లల చదువుకు శాపంగా మారుతున్నాయి. అటువంటి వాటిని అన్నింటినీ అధిగమించి చదువు కొనసాగిస్తుంటే, మగరాయుళ్ళ రకరకాల వికృత ప్రవర్తనలు, వేధింపులు, వెకిలి చేష్టలవల్ల చదువుకు దూరమవుతున్నవారి సంఖ్య తక్కువేమీ కాదు.

ఈ ప్రతిబంధకాలను కూడా తట్టుకొని కష్టపడి చదువుకుందామనుకొన్నా ఆర్థిక పరిస్థితి అనుకూలించని వారు ఎందరో ! ఇక ఏదో విధంగా చదువులో గట్టెక్కి గుర్తింపు పత్రం తీసుకున్నా, తగిన నైపుణ్యంలేక ఉపాధి అవకాశాలు దొరకడం లేదు. నైపుణ్యాలు పెంచుకోవడానికి, నచ్చిన ఉద్యోగం చేయడానికి చాలా తక్కువ మంది మహిళలకే అవకాశాలుంటున్నాయి.

పుట్టినప్పటినుండి, వివిధ స్థాయిలలో స్త్రీలు వివక్షకు, అణచివేతకు గురవుతున్నారు. సమస్యల నుంచి మహిళలకు శాశ్వత విముక్తి కలిగించేందుకు కేవలం నైతిక ప్రచారం, సలహాలు, పథకాలు స్వల్ప వడ్డీ రుణసౌకర్యాలు సరిపోవు. రాజకీయ వ్యవస్థలో వారు కూడా భాగస్వాములై, నిర్ణయాధికారులుగా మారితేనే సమూల మార్పు మొదలవుతుంది.

అయితే ప్రస్తుతం మన రాజకీయ వ్యవస్థలో ఇంకా సంప్రదాయ ధోరణే కొనసాగుతోంది. మహిళల సమస్యలకు పరిష్కారంగా కాకపోయినా, కొంతకాలం పరిహారంగానైనా రాజకీయ రిజర్వేషన్లను ఇవ్వడానికి వాళ్ళు ససేమిరా అంటున్నారు. ఓట్లు దండుకోవడంకోసం మాత్రం ఇదిగో ఇస్తున్నాం, అదిగో ఇస్తున్నామంటూ కొన్నేళ్ళుగా తాత్సారం చేస్తున్నారు. ఎన్నో పోరాటాల తర్వాత బిల్లు మంజూరు అయినా అమలు మాత్రం అంతంతమాత్రమే ఉంటుందనే చెప్పాలి.

అందుకే మహిళలు రాజకీయ పార్టీలపైన గట్టి ఒత్తిడి తేవాలి. తమకు రాజ్యాంగ సవరణతోను, చట్టాలతోను సంబంధం లేకుండా అన్ని పార్టీలు 33 శాతం ప్రాధాన్యమివ్వాలని బలీయంగా ఉద్యమించాలి. ప్రతి పార్టీ అంతర్గతంగా ఉన్న పదవుల్లో కూడ తమకు మూడోవంతు ప్రాధాన్యమివ్వాలని కోరాలి. ఆత్మగౌరవం, స్వావలంబనతో జీవించేందుకు కీలక అడుగుగా మహిళలంతా రాజకీయాల్ని సీరియస్‌గా పట్టించుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. విద్య, వైద్య, ఉపాధి అవకాశాలు మొదలైన అన్నింటిలో సమాన హక్కులు కలిగి ఉంటేనే మహిళ ముందడుగు వేయగలదు.

* * * *

# హరితాంధ్రప్రదేశ్ సృష్టికర్త

– బి. శ్రీనివాసరెడ్డి
బి.ఎ. (తె.మీ) ద్వితీయ

ఆంధ్ర ప్రజల జీవితంలో కన్నీటి కడగండ్లే తప్ప ఆనందపు క్షణాలకు దూరమై దుఃఖిస్తున్న సమయంలో నేనున్నా మీ తోడు అంటూ ప్రతి గుండె చప్పుడును చవిచూచి ఆ గుండెలోతుల్లో వున్న బాధను గ్రహించి ఆ బాధల నుండి ఆంధ్ర ప్రజలను విముక్తులను చేయడానికి దివినుండి భువికి దిగివచ్చిన ఒకే ఒక్క మగధీరుడు డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డి.

అపదలో వున్నవారికి ఆపద్బాంధవుడై, పేద ప్రజల ఆశాదీపమై, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ, మహిళలకు మాన్యుడై, రైతులపాలిట పెన్నిధియై, ప్రతి ఒక్కరికీ సహాయాన్ని అందించిన మహానుభావుడు రాజశేఖరుడు. రాష్ట్రాన్ని అగ్రగామిగా నిల్పేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రాన్ని సస్యశామలం చేయాలనే తపనతో దాదాపు కోటి ఎకరాలకు సాగునీరును అందించే గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించి, రాష్ట్రంలోనే కాదు యావత్ దేశ ప్రజలందరి దృష్టిని ఆయన ఆకర్షించాడు. ఐదేళ్ళ కిందటి వరకూ ఆంధ్రరాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో జలమూలేదు, వ్యవసాయమూ లేదు! ఉన్నదంతా కరువే. నెర్రకొట్టిన భూమే ! డొక్కలెండిన పశువులే !! మరినేడు పాడి పంటలతో పల్లె సీమలు సస్యశ్యామలమయ్యాయి. రాష్ట్ర ప్రజల ఉజ్వల భవితకు మార్గం సుగమం అయినది. నాలుగేళ్లలో 14.26 లక్షల ఎకరాలకు నీరందించే ప్రాజెక్టులు చేపట్టి రాష్ట్రాన్ని హరితాంధ్రగా మార్చే బృహత్తర కృషిలో భాగమే ఇదంతా. ఒక్క నాగార్జున సాగర్ పూర్తి అవుతేనే రాష్ట్రం ఎంతమందికో తిండిపెట్టగల్గుతోంది. అటువంటిది ఇన్ని ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రంలో కరువు అన్నది భవిష్యత్తులో ఉంటుందా ?

ఏ సమాజ అభివృద్ధికి అయినా ప్రాతినిథ్యం వహించేది యువత. సామాజిక, ఆర్థిక, వ్యాపార, రాజకీయ రంగాలలో యువత పాత్ర ప్రధానమైనది. ముఖ్యంగా రాష్ట్రం ఐ.టి. రంగానికి ప్రపంచ కేంద్రంగా మారాక యువతను ఉద్యోగార్హులుగా తీర్చిదిద్దేందుకు వై.యస్. ప్రవేశపెట్టిన పథకమే "రాజీవ్ ఉద్యోగశ్రీ" దీనికి తోడుగా రాజీవ్ యువశక్తి, జవహర్ నాలెడ్జ్ కేంద్రాలను స్థాపించి, ఆయన యువతను ఉపాధివైపు నడిపించారు. ఈ పథకాలు పూర్తయి ప్రతి గ్రామానికి కనీసం 10 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగం కల్పించే అవకాశం వుంది. అంతే కాకుండా మహిళా సాధికారతకుగాను మహిళలకు పావలా వడ్డీ ఋణాలు ఇచ్చి తద్వారా వారి అభివృద్ధితోపాటు దేశానికి ఆర్థిక ప్రగతిని సాధించేలా మహిళలు తమ సొంత కాళ్లపై నిలబడేవిధంగా కృషిచేశాడు.

అధికారంలోకి వచ్చినవెంటనే యిచ్చిన మాట ప్రకారం రైతుల ఆత్మహత్యలను అరికట్టడానికి రైతులకు అన్ని విధాలుగా ఆదుకునే ప్రయత్నంలో భాగంగా విద్యుత్ చార్జీలను రద్దుచేస్తానని తొలి సంతకం విద్యుత్ చార్జీల ఫైలుపైనే చేశాడు. దారిద్ర్యరేఖకు దిగువున వున్నవారికి కూడు, గూడు, గుడ్డలను సమకూర్చడానికి ఇల్లులేని ప్రతి ఒక్కరికీ "ఇందిరమ్మ ఇళ్ళు" పథకం పేరుతో పక్కా గృహాలను ఇవ్వడం జరిగింది. దాదాపుగా 10 లక్షల కుటుంబాలు లబ్ధిపొందాయి.

రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్‌గా మార్చాలి అనుకుని ఆ విధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల మన్ననలు పొందిన హరితాంధ్ర సృష్టికర్త, ఆంధ్ర రాష్ట్రాన్ని రామరాజ్యంగా తీర్చిదిద్దిన రాజనీతిజ్ఞుడు, జలయజ్ఞ ప్రదాత, మరొక కాటన్‌దొరగా మన్ననలు పొందిన వై.యస్. సాక్షాత్తూ దేవుడే.

# "సంస్కృతాధ్యయనం కిమర్థమ్"

(సంస్కృతాన్ని ఎందుకు అధ్యయనం చేయాలి)

– డా॥ పి.పి.వి.డి. నాగత్రిశూలపాణి

రీడర్, సంస్కృత విభాగము

అపారమై, అవినాశ్యమై, పరంపరాగతమై, భారతదేశ ప్రతిష్ఠను ప్రకాశింపచేస్తున్న భాష సంస్కృతము. ప్రపంచ భాషలలోనే అత్యంత ప్రాచీనమైనదిగా పరిగణింపబడిన భాష సంస్కృతము. మన శ్రేయస్సును కోరే దేవతలు ఆది నుండి సంస్కృతంలోనే సంభాషణ సాగిస్తున్నారని మన దేశవాసుల విశ్వాసం. అందుకే ఈ భాషకు అమరవాణి, దేవవాణి, గైర్వాణి, సురభాష మొదలగు నామాంతరాలు ఏర్పడినాయి. భారతదేశంలో ఈ భాషాధనమున్నంతవరకు ప్రపంచంలోని ఏ దేశమూ జ్ఞాన విషయంలో ఈ దేశానికి సరిజోడు కాదన్న విషయం వాస్తవం.

చరిత్రకు అందని కాలం నుండి సంస్కృతం వ్యవహార భాషగానేయున్నది. అతిప్రాచీనమైన ఋగ్వేదం సంస్కృత భాషలోనే ప్రకాశిస్తోంది. రామాయణ కాలంలోను, అష్టాధ్యాయిని రచించిన పాణిని కాలంలోను, శంకరాచార్యుల సమయంలోను, భోజుని పరిపాలనా కాలంలోను సంస్కృతం జనప్రియ భాషగా ఆదరం పొందింది. ఆది నుండి 18, 19 శతాబ్దముల వరకు ఉజ్వలంగా ఉన్న భాష కారణాంతరాలవల్ల వ్యవహార రూపంలో ఆదరాన్ని కోల్పోయింది. ఇపుడు సంస్కృతం మాట్లాడే వారి సంఖ్య చాలా తక్కువ. వాస్తవానికి ఎందుకు ఈ భాషను అభ్యసించాలో అందరూ గ్రహించాలి. అందుకే ఈ క్రింది కారణాలను వివరిస్తున్నాను.

## సంస్కృతాన్ని ఎందుకు అధ్యయనం చేయాలి ?

**1. విస్తారమైన సంస్కృత వాఙ్మయాన్ని కాపాడుకొనుటకు:** భారతదేశంలోనేకాక ఈ ప్రపంచంలోనే శ్రేష్ఠంగా పరిగణింపబడే వాఙ్మయమంతా సంస్కృత భాషలోనే ఉన్నది. భగవంతుని నిశ్వాసతుల్యంగా ఆవిర్భవించిన వేదములు సంస్కృత భాషా భరితములే. వేదాంగములు, బ్రాహ్మణములు, అరణ్యకములు, ఉపనిషత్తులకు, ఆధారభాష సంస్కృతమే. ఆస్తిక, నాస్తిక దర్శనములు, వివిధ శాస్త్రములు, అష్టాదశ పురాణములు, రామాయణ, భారత, భాగవతాది గ్రంధరాజములు అనేక విధములైన కావ్య నాటకములు మొదలగు సాహిత్యమంతా సంస్కృత భాషకు మాత్రమే అమరిన అలంకారంగా చెప్పవచ్చు. ఒక్క రామాయణమునే అనుసరించి ఈనాటికీ అనేక భాషలలో లెక్కకుమించిన రచనలు వస్తూనే ఉన్నాయి. శ్రీరాముని విడిస్తే ఈ ప్రపంచ సాహిత్యంలోనే అంతటి గుణగరిష్ఠుడైన నాయకుడు లేడన్న మురారి కవి మాట శ్రీమద్రామాయణం యొక్క లోకోత్తర వైశిష్ట్యాన్ని తెలియజేస్తుంది. ధర్మ, అర్థ, కామ, మోక్షములకు సంబంధించిన ఏ విషయమైనా ఇక్కడ ఉన్నదే ఇతరగ్రంథాల్లో ఉండగలదని, ఇక్కడ లేనిది మరెక్కడా ఉండదని ప్రతిజ్ఞచేసి వ్యాసమహర్షి రచించిన లక్ష శ్లోకాలుగల మహాభారతం ప్రపంచ సాహిత్య చరిత్రలోనే అద్భుతమైన గ్రంథంగా నేటికీ గౌరవింపబడుతోంది. భాసుడు, కాళిదాసు, భారవి, బాణుడు, భవభూతి, శ్రీహర్షుడు, జయదేవుడు మొదలగు మహాకవులెందరిచేతనో ఉన్నత విలువలుగల సాహిత్యాన్ని వెలయింపజేసిన భాష సంస్కృతం. మూల సాహిత్యంలోని వాస్తవమైన మాధుర్యాన్ని ఆస్వాదించుటకు, ఆ వాఙ్మయాన్ని కాపాడుకొనుటకు సంస్కృత భాషను అధ్యయనం చేయడం ఆవశ్యకం.

**2. సుభాషితాల ద్వారా జీవితాన్ని చక్కదిద్దుకొనుటకు:** జనహితాన్ని సర్వదా అపేక్షించే మహానుభావులు కొన్ని పరమ సత్యాలను హృదయానికి హత్తుకొనే విధంగా చెప్పారు. వీటినే సుభాషితాలుగా వ్యవహరిస్తున్నాము. మన సంస్కృత వాఙ్మయంలో సుభాషితాలకు కొదవలేదు. భర్తృహరి సుభాషిత త్రిశతి అను పేరుతో మూడు శతకాలను రచించాడు. పంచతంత్ర, హితోపదేశాది కృతులు సుభాషితాలకు నిలయాలు. 'అతి సర్వత్రవర్జయేత్' అన్నిటిలోను అతిగా ఉండటం (ప్రవర్తించడం) విడచిపెట్టాలి. "ఏకఃస్వాదు న భుంజీత" ఒక్కడే మధుర ఫలాన్ని అనుభవించరాదు. "సహసా విధధీత న క్రియాం" తొందరపడి ఏ పని చేయరాదు. "పరోపకారాయ సతాంవిభూతయః" సజ్జనుల సంపదలు పరోపకారమునకే. వస్త్రము, వర్చస్సు, వాక్కు, విద్య, వినయములనే ఐదూ విజయానికి కారణాలు. ఇలా లెక్కకు మించిన సుభాషితాలను చెప్పవచ్చు. వీటిని తెలుసుకొని జీవితగమనాన్ని చక్కదిద్దుకొనాలంటే సంస్కృతమును అభ్యసించవలసినదే.

**3. సదాచారాలను పెంపొందించుకొనుటకు :** మంచి విషయాలను ఆచరించడం, మంచివారి మార్గాన్ని అనుసరించడం సదాచారం. దీనివలన దీర్ఘాయువు, అక్షయమైన సంపదలు కలుగుతాయని విష్ణుస్మృతి తెలిపింది. శృతి, స్మృత్యాది గ్రంథాలు సదాచారములను విపులంగా పేర్కొన్నాయి. "భూత్యై జాగరణం" అనే యజుర్వేద వచనం ఐహిక, ఆముష్మిక సంపదలు కోరేవారు జాగరూకత కలిగి సత్ప్రవర్తనతో ఉండాలని ఆదేశించింది. "వృత్తం యత్నేన సంరక్షేత్" ప్రయత్నించి తన చరిత్రను, నడవడిని రక్షించుకోవాలని మహాభారతము తెలిపింది."శీలం పరంభూషణమ్" అని భర్తృహరి కూడా శీల రక్షణం ముఖ్యమన్నాడు. "తేన త్యక్తేన భుంజీథాః" మనకున్న సంపదను భగవంతుడిచ్చినదిగా గ్రహించి ఇతరులకు సాధ్యమైనంత సమర్పించి మిగిలినది స్వీకరించాలని ఈశావాస్యం ఎలా ప్రవర్తించాలో తెలిపింది. సంస్కృతం నేర్చిన సందర్భంలోనే ఆయా సదాచార విషయాలను మనం గ్రహించగలుగుతాము.

**4. ఐకమత్యాన్ని సాధించుటకు :** ప్రజలంతా ఒకటిగా ఉండాలని సంస్కృత గ్రంథకర్తలందరూ ఆశించారు. "సంహతిః కార్యసాధికా" కలసి ఉంటే కార్యాలు సాధించవచ్చు అని హితోపదేశకారుని మాట. "సంగచ్ఛధ్వం, సంవదధ్వం, సంవోమనాంసి జానతామ్" మనం కలిసి నడుద్దాం, ఏకమై మాట్లాడుదాం, మన మనసులు ఒకటిగా ఉండాలి అని ఋగ్వేదం ఐక్యమంత్రాన్ని చెప్పింది. దేశాన్ని రక్షించుకోవడంలో కూడా ఐకమత్యాన్ని చూపాలని వేదవచనం. "మాతాభూమిః పుత్రోహంపృథివ్యాః వయంరాష్ట్రే కురుహితాయ స్వాహా" ఈ నేల నా తల్లి, నేను ఈ భూమికి పుత్రుణ్ణి. ఈ దేశ హితం కోసం నేనేమైనా చేస్తాను, అని యజుర్వేద మంత్రం దేశం కోసం ఐకమత్యంగా ఉండమని చెప్పింది. ఇలాంటి ఐక్యభావాలు అర్థంచేసుకోవాలంటే సంస్కృతాధ్యయనం యొక్క అవసరం ఎంతైనా ఉంది.

**5. విశ్వశాంతిని సంపాదించుటకు :** "విశ్వస్య కళ్యాణమస్తు" ప్రపంచానికి శుభం జరగాలి అని మన పెద్దలు ఆశించారు. శాస్త్రాలలో వర్ణింపబడిన యజ్ఞకర్మలు స్వార్థాన్ని విడచి త్యాగ గుణాన్ని పెంపొందించి శాంతికి దోహదం చేస్తాయి. "తత్ర కోమోహః కః శోకః ఏకత్వమనుపశ్యతః" ప్రపంచాన్ని ఒకటిగా చూచువానికి శోక మోహములుండవని యజుర్వేదం తెలిపింది. "ఆత్మోపమ్యేన సర్వత్ర" అన్న గీతా వాక్యం నిన్ను నీవెలా ప్రేమించుకొంటావో అందరినీ అలా ప్రేమించమన్నది. ఏ కార్యాలవలన నీకు కష్టం కలుగుతోందో వాటిని నీవు

ఇతరులకు చేయవద్దని మహాభారతం ఉపదేశించింది. శాంతికి దోహదం చేసే ఈ భావాలను సరిగా తెలుసుకోవాలంటే మనం సంస్కృతాన్ని అభ్యసించాలి.

**6. ధర్మబద్ధంగా ప్రవర్తించుటకు :** ఆర్షులు ధర్మబద్ధమైన జీవితానికి ఎంతో ప్రాధాన్యమిచ్చారు. "వేదోఽఖిల ధర్మమూలం" అన్ని ధర్మాలకు వేదమే మూలము. "యతోఽభ్యుదయనిశ్శ్రేయస సిద్ధిః సధర్మః" దేనివలన అభ్యుదయ, నిఃశ్శ్రేయసములు (మోక్షము) లభించునో అది ధర్మమని కణాదుడు వైశేషిక దర్శనంలో చెప్పాడు. "ధర్మోరక్షతి రక్షితః" ధర్మాన్ని రక్షిస్తే అది మనను రక్షిస్తుందని మహాభారత వచనం. భారతం సర్వం ధర్మప్రాధాన్యమైన గ్రంథమే.

*సత్యం దమః తపః శౌచం సంతోషో హ్రీః క్షమార్జవమ్ ।*
*జ్ఞానం శమో దయా ధ్యానం ఏష ధర్మస్సనాతనః ॥*

సత్యము, ఇంద్రియ నిగ్రహము, తపస్సు, శుచిత్వము, సంతోషము, సిగ్గుపడుట, ఓర్పు, ఋజుత్వము, జ్ఞానము, దయ, ధ్యానము అనే పదింటిని సనాతన ధర్మములుగా పేర్కొన్నారు. విస్తృతమైన ధర్మతత్త్వాన్ని గ్రహించి ఆచరించాలంటే సంస్కృతాధ్యయనం అవసరం.

**7. తత్త్వజ్ఞానంతో తరించుటకు :** మానవ జీవిత గమ్యం మోక్షసాధనమే. ప్రపంచమిథ్య. ఏకమేవాద్వితీయం బ్రహ్మ (ఛాం.ఉ) బ్రహ్మమొక్కటే సత్యము. మనం అనుభవించే సుఖం కూడా దుఃఖమిశ్రితమే. శరీర త్యాగమే మరణం. జీవుడు ఆత్మతత్త్వాన్ని గ్రహించనంతవరకు శోక, మోహములకు బద్ధుడు. తత్త్వజ్ఞానం కలుగుతే దుఃఖం నశిస్తుంది. భిద్యతేహృదయగ్రంథిః (ముం॥ఉ) హృదయ గ్రంథులు విడివడుతాయి. అహం బ్రహ్మాస్మి (బృ॥ఉ॥) తానే బ్రహ్మనని గ్రహిస్తాడు. అలా మోక్షం పొందడం నిజమైన గమ్యం. ఉపనిషత్తులు ప్రబోధించిన ఈ తత్త్వం వేదాంతంగా వ్యవహరిస్తున్నాము. సంస్కృత భాషాబద్ధమైన ఈ వేదాంతాన్ని గ్రహించాలంటే సంస్కృతం నేర్చుకొనవలసినదే.

**8. మరికొన్ని ప్రయోజనాలు :** 1. మానవజాతి యొక్క చరిత్రను, మానసిక వికాస క్రమాన్ని అధ్యయనం చేయడానికి (2) సంస్కృతిని పరిరక్షించడానికి (3) ఆత్మగుణాలు వికసించడానికి (4) పుట్టునది మొదలుకొని మనం జరుపుకొనే మంత్రబద్ధమైన షోడశసంస్కారముల విషయములు గ్రహించడానికి (5) ఉచ్చారణా స్పష్టత పెంపొందుటకు (ఒక్క సంస్కృత భాషలోనే ఎలా వ్రాస్తే అలా పలుకుతాం. ఏ ఒక్క అక్షరాన్నీ వదలి పలకము) (6) ఎక్కువ కాలం జీవనం సాగించేందుకు (దీర్ఘ సమాసయుతమైన సంస్కృత భాష మాట్లాడినపుడు మనం గ్రహించే శ్వాస యొక్క వ్యవధి ఎక్కువై ఎక్కువ కాలం జీవించే అవకాశం కల్గుతుంది). సంస్కృతాన్ని అభ్యసించాలి.

*దేశభాషాతు భూషావత్ ఏకదేశవిలాసినీ ।*
*వస్త్రవద్దేవ భాషాతు సర్వదేశ విహారిణీ ॥*

ప్రాంతీయ భాషలు ఆభరణాలవంటివి. ధరించిన ప్రదేశంలో అందాన్నిస్తాయి. దేవభాషైన సంస్కృతం వస్త్రం వంటిది. శరీరానికంతటికీ నిండుదనమిస్తుంది. అందుకే అందరం సంస్కృతవాణిని మన భాషగా చేసుకొని ధన్యులు కాగలుగుదాం.

❋❋❋❋



# గురజాడ గేయాలు - కథన కౌశల్యం

– డా॥ కె. శ్రీరామిరెడ్డి
రీడర్, తెలుగు విభాగము

గురజాడ అడుగుజాడ ఆధునికాంధ్ర సాహిత్యానికో వెలుగుజాడ. గురజాడ కంటే ముందు ఆధునిక వస్తువుతో గేయ రచనలు చేసిన వారున్నా వస్తు, భావ, శిల్పాల దృష్ట్యా ప్రథమాంధ్ర గేయ కవిగా గురజాడనే గుర్తించవలసి ఉంటుంది. పద్య విద్యకు నన్నయవలె గేయకవితా విద్యకు గురజాడ ఆద్యుడు. ప్రాచీన కవుల్లో తిక్కన, మధ్య యుగకవుల్లో వేమన, ఆధునిక కవుల్లో గురజాడ తనకు నచ్చిన మహా కవులని శ్రీశ్రీచే గురజాడ కొనియాడబడ్డాడు.

గురజాడ రచనలన్నీ ఆపాద మస్తకమూ నవ్యతతో తొణికిసలాడుతుంటాయి. వస్తువులో, భాషలో చంధస్సులో, భావంలో, శిల్పంలో క్రొత్త పుంతలు త్రొక్కిన నవ్య సాహిత్య స్రష్ట గురజాడ. తాను రాసిన గేయాల్లో కనుమరుగవుతున్న కథను యిమిడ్చి ఆయన సాహిత్యాన్ని సంపన్నం చేసాడు. కవితల్లో ఆసక్తిదాయకంగా కథను చెప్పడమన్నది ఆయన సాధించిన ప్రత్యేకత.

కవితల్లో కథలు చెప్పడమనే విధానాన్ని గురజాడ చేపట్టడానికి ఆనాటి సామాజిక పరిస్థితులే దోహదం చేశాయి. ఆనాడు సంఘంలోని డాంబికాలు, ఆర్భాటాలు, దురాచారాలు, మూఢ విశ్వాసాలు, కులమత వైషమ్యాలు, బాల్య, వృద్ధ వివాహాలు, కన్యాశుల్క సమస్యలు అయన దృష్టిని సునిశితం చేసాయి. తాను చూసిన సామాజిక పరిస్థితులకు కవితాకృతినిదిద్ది 'కథలుగా' చెప్తే బాగుంటుందని ఆయన భావించారు. పైగా ఆయనకు మొదట నుండి కథలంటే యిష్టం కావడం కూడా యీ విలక్షణ ప్రయోగానికి దారితీసింది.

గురజాడ కాలంనాటికి సృజనాత్మక కథలు వెలువడలేదు. కథలంటూ ఉన్నా అవి యే కాశీ మజిలీ కథలో, అనువాద కథలో కావడం సృజనాత్మక కథా రచనకు గురజాడను ప్రేరేపించింది. పాత చింతకాయ పచ్చడి కథలు, కాలక్షేపం కోసం రాయబడ్డ కథలు. గురజాడను సరిక్రొత్త రూపంలో కథలు చెప్పడానికి పురికొల్పాయి. సంస్కృత అనూదిత పంచతంత్ర కథలు, కథాసరిత్సాగరం కథలతో ఆనాటి అంధ్ర పాఠకులు వినోదించేవారు. హృద్యమైన, అందమైన కథల కోసం అర్రులు చాస్తున్న వారికి తన కథలతో, కథా గేయాలతో సరిక్రొత్త ప్రపంచానికి కవాటాలు తెరిచారు గురజాడ.

సమకాలీన సామాజిక స్పర్శలేని పాత కథలపట్ల ఏవగింపుతో గురజాడ క్రొత్త దృక్పథముతో కథా రచనను సంకల్పించారు. కల్పనా కథల పద్ధతులని విడనాడి తనదైన ప్రత్యేక ముద్రగల చిన్న కథలను సృష్టించారు. ఆయన మొదటి కథ "మనుషులు చేసిన దేవుళ్ళారా ? మీ పేరేమిటి". ఆయన దాదాపు 'ఆరు' ముత్యాలవంటి కథలను రాసి ఆధునిక సాహిత్యంలో కథా ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఆ చిన్న కథల్లో సమస్యల్ని చిత్రించి, వాటి పరిష్కారాలను సూచించారు. అందులో దిద్దుబాటు కథ ఆనాటి ఓ సామాన్య స్త్రీ తన భర్తను మార్చిన వైనాన్ని అద్భుతంగా చూపిస్తుంది. ఆనాడు వ్యవహారంలో వున్న భాషను ఆ కథల్లోవాడి బలమైన అభివ్యక్తిని సాధించారు.

'కథ' అన్నది ప్రాచీన సాహిత్యంలో కల్పిత ప్రాంతాలతో కట్టు కథలతో నిండి ఆనాటి సమాజాన్ని ప్రతిబింబింప చేయలేకపోయింది. తెలుగులో అనూదితమయిన రామాయణ, భారత, భాగవతాలు తర్వాత స్వతంత్ర రచనలుగా ప్రతిభాసించిన ప్రబంధాలూ కొంత వరకు నాటి సామాజిక పరిస్థితులను ఒక పరిమితిలో ఆవిష్కరింపగల్గినా, అవి సామాన్య జనజీవన స్థితిగతుల జోలికి వెళ్ళలేదు. సామాజిక స్పృహకంటే వారిలో కవితాప్రకర్షే అధికంగా కనిపిస్తుంది. సాహిత్యంలో సామాజిక స్పర్శలేకపోతే అది మృతప్రాయమవుతుందని

గ్రహించి ఆ దిశగా మొదట కదలిన వ్యక్తి గురజాడ సాహిత్యంలో సామాజిక చిత్రణ అవసరాన్ని గుర్తించి నూతన దృక్పథాన్ని ఏర్పరచుకొని యధార్థ జీవిత చిత్రణే సాహిత్య ధ్యేయం కావాలని అభిప్రాయపడ్డారు. అందుకే తాను వ్రాయబోయే అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ యధార్థ జీవన దృశ్యాలకు కథను జోడించి సమకాలీన జీవిత సంఘర్షణలను పల్కించాలని సంకల్పించాడు. కళాత్మకంగా వ్రాయడమేకాదు, అందులో మానవ జీవిత చిత్రణ అనివార్యంగా ఉండాలని తలచి ఆ దిశగా కవితాప్రక్రియను కొనసాగించాడు గురజాడ.

గురజాడ పూర్వమున్న సంప్రదాయ పద్య విద్యను, కీర్తన విధానాన్ని వదలిపెట్టి సామాన్య జన పరిభాషలో పాడుకోడానికి అనువైన మాత్రా చందస్సులో గేయాన్ని వాడుకొని, ఆధునిక భావాలతో కథలను చెప్పడానికి పూనుకొన్నాడు. కథలను ఎలా చెప్పాలో తెలిసినవాడు కనుక తాను వ్రాయబోతున్న క్రొత్త ముత్యాల సరాల గేయాల్లో తన కథన కౌశల్యాన్ని జోడించి వాటిని ఆకట్టుకొనేలా చిత్రించాడు.

గురజాడ ముత్యాల సరాల గేయాల్లో చూపిన కథనకౌశల్యం అద్వితీయం. అనన్యసాధ్యం. అదో కళాత్మక అద్భుత ప్రక్రియ. గురజాడ కథన కౌశల్యానికి పట్టు కొమ్మలుగా కన్పించే పది ముత్యాల సరాల గేయాలలో మూడు అత్యంత ప్రతిభావంతంగా కన్పిస్తాయి. అందులో మొదటిది 'లవణరాజు కల', రెండవది 'కన్యక', మూడవది 'పూర్ణమ్మ'.

'లవణ రాజు కల' లో నిశ్చలమయిన ప్రేమ ముందు కులాల అడ్డుగోడలు కుప్పకూలుతాయన్న సత్యాన్ని కళ్ళ ముందు నిలుపుతాడు. 'అంటరానివాళ్ళ'ని అపహాస్యం చేసే సంఘ దౌష్ట్యాన్ని నిరసిస్తాడు. మలిన దేహుల్ని మాలలని, మలిన చిత్తులకు అధిక కులాన్ని కట్టబెట్టిన వర్ణధర్మమూ ఒక ధర్మమేనా ? "ఇది అధర్మమంటూ" వర్ణ వ్యవస్థను తీవ్రంగా దుయ్యబట్టడం యీ కథా గేయంలో కన్పించి పాఠకుల్ని ఆలోచింపజేస్తుంది.

ఇక 'కన్యక' గేయంలో 'తాను తలచిందే ధర్మం, తాను చెప్పిందే శాస్త్రం' అని విర్రవీగే అహంకార పాలకులకు, కాసు వీసం కొరకు తమ పిల్లల జీవితాలను మంటగలిపే తల్లిదండ్రులకు కనువిప్పు కల్గించే సన్నివేశాలను చిత్రించి కళ్ళముందు నిలబెడతారు. తనను చెట్టబట్టాలనుకొన్న రాజుకు చిక్కకుండా ఆత్మాభిమానంతో అగ్నికి తనను ఆహుతి చేసి కొన్న 'కన్యక' స్త్రీలకు మార్గదర్శకం కావాలని కథలో ధ్వనింపజేసారు గురజాడ.

'పూర్ణమ్మ' కథ గురజాడ ముత్యాలసరాల గేయాల్లో ప్రతిభావంతమైన రచన. బాల్య వివాహాల మీద గురజాడ సంధించిన అస్త్రంగా యీ పూర్ణమ్మ కథ కన్పిస్తుంది. కరుణరసం చిప్పిల్లే యీ కథా కావ్యాన్ని చదివిన వారూ, విన్నవారూ తప్పక కన్నీళ్ళు నింపుతారు. అంత హృదయదగ్గంగా కథను నడిపారు గురజాడ. సమకాలీన బాల్య వివాహోదంతాన్ని బలీయంగా చిత్రించిన కథ పూర్ణమ్మ కథ. ఆనాడు సంఘాన్ని పీడించిన దురాచారాల్లో కన్యాశుల్కమొక్కటి. ధనాశాపరులైన తల్లిదండ్రులు తమ ముక్కుపచ్చలారని బిడ్డలను వృద్ధులకిచ్చి డబ్బుకమ్ముకొనే హేయగుణాన్ని యిందులో తీవ్రంగా దుయ్యబట్టాడు గురజాడ.

తరుణ వయస్కురాలైన పుత్తడి బొమ్మవంటి పూర్ణమ్మ ఆమె తల్లిదండ్రులు కాసుకులోనై ముసలివానికి కట్టబెట్టారు. ఆ ముసలిని చూచి పూర్ణమ్మ ముఖ కమలం వాడింది. తోటి పిల్లలు 'మొగుడు తాత'యని గేలి చేస్తుంటే కుంచించుకుపోయింది. విధిరాతకు పరిపరి విధాలా చింతించింది. సాయంత్రం దుర్గ గుడికి పూజా నిమిత్తం వెళ్లింది. అలా వెళ్ళిన పూర్ణమ్మ మళ్ళీ గుడి నుండి తిరిగిరాలేదు. ఆ సందర్భంలో గురజాడ చేసిన వర్ణన చాలా యుక్తి యుక్తంగా ఉంటుంది. "కన్నుల కాంతులు కలువలు చేరెను, మేలిమి చేరెను మేని పసల్, హంసల చేరెను నడకల బెడగులు, దుర్గను చేరెను పూర్ణమ్మ" అంటూ పూర్ణమ్మ దుర్గలో లీనమవడాన్ని (మరణించడాన్ని) ఎంతో కళాత్మకంగా వర్ణించి కథకు చక్కని ముగింపునిస్తాడు గురజాడ. కన్నుల కాంతిని కలువల నుండి, మేని పసలను

బంగారం నుండి, నడకల బెడగలను హంసల నుండి అరువు తెచ్చుకొన్న పూర్ణమ్మ మరల వాటిని తానెక్కడి నుండి తెచ్చుకొన్నదో వాటికే యిచ్చేసిందని, ఆమె అస్తమించిందన్న విషయాన్ని గురజాడ అద్భుతంగా వర్ణిస్తాడు. తనకథన కౌశల్యాన్ని ప్రదర్శిస్తాడు.

కథను ముగించడంలోను, ప్రారంభించుటలోను కూడా గురజాడ తన కథన కౌశల్యాన్ని ప్రదర్శిస్తాడు. "మేలిమి బంగరు మెలతల్లారా, అమ్మలగన్న అమ్మల్లారా, విన్నారమ్మా మీరీ కథను" అంటూ మొదలెట్టి ఆసక్తి జనింపజేస్తూ "కొండల నడుమా కోనొకటున్నది" అంటూ కథలోకి పఠితుల్ని నేరుగా తీసికెళ్ళి అబ్బురపరుస్తాడు. కథన చాతుర్యం తెలిసినవాడు కనుక కథను కుంటుపడనీక సూటిగా చెప్పటానికి ప్రయత్నిస్తాడు.

భర్తను చూడగానే తన ముద్దు ముచ్చటలు మాసిపోయాయని, తన ముఖ పద్మము వాడి పోయిందని పూర్ణమ్మ గురించి చెప్పడంలో, అనవసర పదాడంబరాలజోలికి పోని, పదాలను పొందికగా పొదుపుగా వాడే గురజాడ మనకు కన్పిస్తాడు. పదాల పొదుపుతో బలమైన అభివ్యక్తిని సాధించే కథన శిల్పం అయనలో కనిపిస్తుంది. సాయంకాలమైంది ఆవులూ, పెయ్యలు మందలు చేరాయి. పిట్టలు చెట్లను గుమిగూడాయి. మింట చుక్కలు మెరుస్తున్నాయి. కొండల్లో చీకటి నిండింది. మేతకు మేకాలు మెసలుతున్నయ్. దుర్గకు మెడలో హారాలు అమరాయి. అనే మాటల్లో చీకటి పడ్డ విషయాన్ని సూర్యాస్తమయ దృశ్యాన్ని కళ్ళముందు నిలిపి తన పదాల పొందికతో పఠితల మనస్సులకు భావోద్వేగాన్ని కల్గిస్తాడు. హృదయాలకు హత్తుకొనేటట్లు కథను నడిపిస్తాడు.

గురజాడ తన కథన కౌశల్యాన్ని యీ మూడు ముత్యాల సరాల గేయాల్లో రమణీయార్థ ప్రతిపాదితంగా, రసవంతంగా ప్రదర్శించారు. పఠితల్లో ఉత్సుకతను, ఉత్కంఠను రేపుతూ కథను కళాత్మకంగా, సజీవ సమకాలీన సమస్యల చిత్రణతో నడుపుతూ ఆకట్టుకొంటాడు. "జీవితాన్ని నూతన దృక్పథంతో దర్శించి కథా కవితా రూపంలో దాని తత్వాన్ని అన్వయించడానికి ప్రయత్నించాను" అన్న గురజాడ మాటలను యీ మూడు కవితా రూప కథలు ప్రతిభావంతంగా నిరూపిస్తాయి. సంఘ సంస్కరణను సాధనంగా తన కావ్యకళను కథలకు అన్వయించి చెప్పి అందులో సఫలీకృతుడయ్యాడు గురజాడ.

* * * *

# నా రైతు ఏమయ్యాడు ?

– యస్. హరిప్రసాద్

బి.కామ్. (తె.మీ) ప్రథమ

కోడి కూతకు ముందే నిద్రలేచి తరలించటానికి సిద్ధంగా ఉంచిన పంటను తీసుకుని పట్టణానికి బయలుదేరాడు రామయ్య. కొన్ని గంటల తర్వాత పట్టణానికి చేరుకుని మార్కెట్టుకు వెళ్లాడు. ఆ సమయంలో కొనుగోలు వ్యాపారస్తులు ఎవరూ లేకపోవడంతో ఏదైనా కొద్దిగా ఎంగిలిపడుదాం అనుకుని మార్కెట్టు బయటికి వచ్చాడు. ఒకే వీధిలో హోటళ్లు వరుసగా ఉండటంతో అందరూ వారి వారి హోటళ్లలోకి రమ్మని పిలుస్తున్నారు. రామయ్యకు అంతా కొత్తగా ఉంది. ఎందుకంటే పట్టణానికి ఎప్పుడూ రాలేదు. పంట అమ్మాల్సివస్తే ఎపుడూ అతని ఊరి రెడ్డి కొనేవాడు. అంతా గోలగోలగా ఉంది అతనికి. ఎందులోకి వెళ్లాలో అంతుపట్టక తిరుగుతూ ఉన్నప్పుడు లారీలోని మూటలను మోస్తూ ఒక కూలీ కనపడ్డాడు. చూసిన ముఖంలా అనిపించింది రామయ్యకు. కొద్దిగా వయసు మల్లడంతో కంటి చూపుసరిగా ఆనక దగ్గరికెల్లి చూద్దామనుకుని వెళ్లాడు. తీరా వెళ్లి చూస్తే అతని చిన్ననాటి స్నేహితుడు కృష్ణయ్య కనబడ్డాడు. ఆకలిని మరచి పోయిన రామయ్య ఆనందంతో కృష్ణయ్యను "ఏరా! కిట్టిగా, ఎలా

ఉన్నావు ! చాలా రోజులయింది చూసి "ఏమి ఇక్కడున్నావు? పిల్లోల్లంతా బాగున్నారా ?" అని పలకరించాడు. కృష్ణయ్య కూడా చాలా ఆనందంతో "నువ్వా రామయ్య ? ఏమి ఇలా వచ్చావు. ఏం సంగతి ? అంతా బాగున్నారా ? అన్నాడు.

చాలా రోజుల తర్వాత కలిసారు కదా ! పాపం చాలా సేపు మాట్లాడుకున్నారు. మాట్లాడుతూ రామయ్య "ఏరా ! కృష్ణయ్య ! నువ్వు మీ పెద్ద అబ్బాయికి పట్టణంలో ఉద్యోగం అని కన్నతల్లి లాంటి పొలాన్ని, ఇంటిని అమ్మి, ఉన్న ఊరిని వదిలేసి ఇక్కడకు వచ్చావు. ఇక్కడ మీ అబ్బాయి, మనవళ్ళు, మనువరాళ్లతో సంతోషంగా ఉంటావనుకున్నాను. ఇలా కూలి పని చేస్తున్నావేమి ? అని అడిగాడు. కృష్ణయ్య "నిజమే ! మా అబ్బాయికి మంచి ఉద్యోగం వచ్చింది, మంచి భార్య వచ్చింది. మంచి జీవితం వచ్చింది. అలా అన్నీ మంచి మంచివి వచ్చిన తర్వాత ఆ మంచి రావటానికి కారణమైన ఈ తండ్రి చెడ్డగాను, వానికి అడ్డుగాను కనపడ్డాడు. భార్య మాటలు విని నన్ను ఇంట్లో నుంచి వెళ్ళగొట్టాడు. తల్లి లాంటి పొలం ఉన్నప్పుడు పది మందికి పెట్టిన చెయ్యితో పది మందిని అడుక్కోవడం చేతకాక ఇలా ఈ వయస్సులో కూడా కష్టపడుతున్నాను. చచ్చిపోదామంటే చావురాలేదు. ఉందామంటే చేత కావడం లేదు. ఏం చేయాలో అర్థంకాక కాలమే ఏదో ఒకటి నిర్ణయిస్తుందని దేవుని మీద భారమేసి ఇలానే ఉన్నాను" అన్నాడు.

అది వినగానే రామయ్య హృదయం చలించిపోయింది. కంటి నిండా నీళ్లతో గద్గద స్వరంతో "రాజాలా బ్రతికావు కదరా ! నిన్ను ఇలాంటి పరిస్థితిలో చూస్తానని, నీ గురించి ఇలా ఇన్ని విషయాలు వింటానని అనుకోలేదు. ఒక ముద్ద అన్నం పెట్టడానికి నీ కొడుకులకు వీలు లేదా ? మరీ అంత బరువైపోయావంటనా ? పోనీ మిగతా ఇద్దరు కొడుకుల దగ్గరికి అయినా వెళ్ళకూడదా?" అని ప్రశ్నించాడు. "ఎవరి దగ్గరికెళ్లి ఏం లాభం రా ? పెద్దోని దగ్గరికెళితే రెండవ వాని దగ్గరకు పొమ్మని, వాని దగ్గరికెలితే చివరివాని దగ్గరకెల్లమని" అంటారు. అందరి దగ్గరికి తిరిగి తిరిగి చెప్పులు అరుగుతున్నాయి కానీ వారి హృదయాలు కరగలేదు. పున్నామ నరకం నుండి తప్పిస్తారని, చివరి వరకూ తోడుంటారని అన్నీ అమ్మి వాళ్ళని చదివించి ప్రయోజకుల్ని చేసాను. చిన్నప్పుడు నా గుండెల మీద ఆడుకుంటూ తంతున్నపుడు అనుకోలేదు. పెద్దయ్యాక గుండెలు పగిలేలా తంతారని. నేను ఎవరికీ భారం కాకూడదు అనుకుని ఇలా బ్రతకాల్సి వస్తోంది" అని కృష్ణయ్య కన్నీళ్ళ పర్యంతం అయ్యాడు.

తరువాత కృష్ణయ్య కన్నీళ్లను తుడుచుకుంటూ "సరేలేరా ! నా సోది ఏం వింటావులే ? ఏం ఎప్పుడూ పల్లె విడిచి రానిది ఇలా పట్టణానికి వచ్చావు" అని రామయ్యను అడిగాడు. "ఏం లేదు రెండో అమ్మాయికి పెండ్లి అనుకున్నాను. మొదటి అమ్మాయి పెండ్లికి మన ఊరి రెడ్డి దగ్గర పొలం తాకట్టుపెట్టాను. ఇపుడు ఆస్తులు ఏమీ లేవు నా భూమినే కౌలుకు తీసుకున్నాను. పండిన పంటను మన ఊరి రెడ్డికి అమ్మితే వాడు మోసం చేసి పంటను కొని కౌలుకు సరిపోయింది అంటాడు. ఒక్క రూపాయి కూడా నాకు ఇవ్వడు. ఇక అమ్మాయి పెండ్లి ఎలా చేస్తా చెప్పు. అందుకే ఇక్కడ పంటను అమ్మితే కొద్దిగా అయినా లాభం వస్తుంది. దానితో రెడ్డికి కౌలు డబ్బులు ఇవ్వచ్చు. అమ్మాయికి పెండ్లి చెయ్యచ్చు". అనుకుని వచ్చాను అని అన్నాడు. అది విన్న కృష్ణయ్య అలాగా ! అదిసరే ఎలా ఉందిరా మన పల్లె" అని అడిగాడు.

"ఏమని చెప్పాలి రా ! నీకు తెలియనిదా ! వర్షాలు లేవు. మోటర్లు అయినా వాడుదాం అనుకుంటే ప్రభుత్వం మనతో కరెంట్ బిల్లులు కట్టించుకుంటుందే కాని కరెంట్ మాత్రం ఇవ్వదు. పశువులకు మేతలేదు. మాకు తినడానికి గింజలు కూడా లేవు. వర్షం పడిన మట్టి వాసన చూసి చాలా రోజులయింది. పంట కోసం అప్పులుచేసి ఎరువులు, పురుగుల మందులు కొంటే ఆ అప్పు తీర్చలేక వ్యవసాయం

చేయలేక ఆ పురుగుల మందులే రైతుకు చావడానికి ఉపయోగపడుతున్నాయి. చాలా మంది చుట్టు ప్రక్కల కొండల్లో, గుట్టల్లో రాళ్ళుకొట్టడానికి వెళుతున్నారు. కొంతమంది పిల్లలను పస్తులుంచలేక వారిని పట్టణంలో హోటళ్లలో పనిచేయడానికి, లారీలలో క్లీనర్లుగాను పంపి వారి జీవితాలను బలి చేస్తున్నారు.

నీ కొడుకులాంటి పల్లె యువకులు కొంత మంది ఉద్యోగాల పేరుతో పట్టణాలలోనే ఉంటూ పల్లెకు రావడమే మానేశారు. ఎప్పుడో పస్తులతో తల్లో, తండ్రో చస్తే వచ్చి ఒక ఏడుపు ఏడ్చి ఆస్తులు పంచుకుని వెలుతున్నారు. ఇలా అధ్వాన్నంగా ఉంది పల్లె" అని వివరించాడు రామయ్య.

అది విన్న కృష్ణయ్యకు పల్లెలో ఉన్నా, పట్టణంలో ఉన్నా ఒకటే అనిపించింది. ఏమంటే పల్లెలో ఉంటే కన్న తల్లితో ఉన్నట్లు ఉంటుంది. అందుకే, చనిపోయే ముందయినా తన పల్లెలోనే ఉండి చనిపోదాం అనుకున్నాడు మనసులో. అంతలోనే పంటను అమ్మి తిరిగి వచ్చి కలుస్తానని రామయ్య వెళ్లాడు.

రామయ్య పంటను ఊరిలో రెడ్డికి అమ్మినా బాగుండేది. కనీసం అతని అప్పు అయినా తీరేది. తన కండలు కరిగించి, రక్తాన్ని చెమటగా మార్చి ఎన్నో వ్యయ ప్రయాసలతో పంటను పండించి పట్టణానికి తీసుకువస్తే ఇక్కడ న్యాయం జరుగుతుందని భార్య బిడ్డలకు నాలుగు ముద్దలు పెట్టవచ్చు, కూతురుకు పెండ్లి చెయ్యవచ్చు అని అనుకున్నాడు. ఎంతో ఆశతో, ఆరాటంతో వచ్చాడు. ఇక్కడ కూడా వంచన ఎదురయింది. అనుకున్న లాభం కాదు కదా అసలు ధర కూడా రాలేదు అతని పంటకి. పాపం! దగాకోరులయిన దళారీల చేతిలో మోసపోతానని అనుకుని ఉంటే ఇంత దూరం వచ్చేవాడు కాదేమో రామయ్య ! గుండె నిండా బాధతో కంటి నిండా నీటితో వస్తూ ఉన్నాడు. అంతలో ఏదోపెద్ద అరుపు వినిపించింది. క్షణాల్లో జనం అంతా గుమికూడారు. వెళ్లిచూసాడు రామయ్య. అక్కడ లారీ చక్రాల కింద రక్తం మడుగులో కొట్టుకుంటూ చావు బ్రతుకుల స్థితిలో కృష్ణయ్య ఉన్నాడు. నిమిషాలలో కృష్ణయ్య చనిపోయాడు. అది చూసిన రామయ్యకు ఏడుపు ఒక్కసారిగా వచ్చేసింది. అప్పటికే బాధలో ఉన్న రామయ్యకు మిత్రుని చావు ఎంతో కలిచివేసింది. కానీ, పాపం ఏమీ చేయలేని స్థితి అతనిది. అలాగే బాధపడుతూ తిరిగి తన పల్లెకు బయలుదేరాడు.

రామయ్య మనసులో ఎన్నో ఆలోచనలు మెదులుతున్నాయి. అతని జేబులో ఉన్న డబ్బుతో పెళ్ళి చేయలేని పరిస్థితి అతనిది. ఒక వేళ పెళ్లి ఆగిపోతే. అవమానం జరుగుతుంది. పరువు పోతుంది. తన కూతురు భవిష్యత్తు ఏం అవుతుందో అని ఆలోచన. పట్టణానికి రావటానికి ముందు కూతురు, భార్య తీసుకురామన్నవి తీసుకోకుండానే వెలుతున్నాడు. ఇంటి దగ్గర అంతా ఎంతో ఆశగా తన కోసం ఎదురుచూస్తు ఉంటారు. మరో పక్క అప్పు తీర్చలేదు. ఊరికి వెళితే రెడ్డి తనను ఎలా నిందిస్తాడో అన్న భయం. ఇంకొక పక్క కళ్లెదుటనే మిత్రుని మరణం, అన్నీ ఆలోచిస్తూ బాధపడుతూ వెలుతున్నాడు రామయ్య. అంతలోనే ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అంతే, రామయ్య మరణించాడు. కాదు కాదు ఒక రైతు గుండెపోటుతో చనిపోయాడు.

"దేశానికి పల్లెలు పట్టు కొమ్మలు" అని ఒకప్పటి నిస్వార్థనేత అంటే ఈనాటి మన నాయకులు "పదవికి పల్లెలు కేవలం పెట్టుబడి కొమ్మలు" అని మార్చేసి రైతు జీవితాలతో ఆడుకుంటున్నారు. పదవుల కోసం, పరపతి కోసం అవసరమయిన రైతు ఈనాడు వేధించబడ్డాడు, దగాపడ్డాడు, చివరకు మృత్యువు బారినపడి శవంగా మారాడు.

* * * *

# శశికరం

– కె. సౌమ్య
యం.ఇ.సియస్. ద్వితీయ

